ఈనాడు
హైదరాబాద్
HMDA
గురువారం 24 ఆగస్టు 2017
24 పేజీలు




సిద్ధమయ్యాడు మహాగణపతి

'శ్రీ చండీ కుమార అనంత మహాగణపతి' పేరుతో ఖైరతాబాద్ వినాయకుడు ఈ ఏడాది కనువిందు చేయనున్న విషయం తెలిసిందే. విగ్రహం తుది మెరుగులు దిద్దుకొని భక్తులకు దర్శనమిచ్చేందుకు సిద్ధమైంది. రూపశిల్పి రాజేంద్రన్ బృందం చివరగా బుధవారం పార్వతీ తనయుడికి కంటి పాపను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో విగ్రహానికి అడ్డుగా ఉన్న కర్రల తొలగింపు పనులు ప్రారంభించారు. భారీ సంఖ్యలో తరలివచ్చే జనానికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పండగ రేపే.. పంపిణీ ఊసేదీ?



- రాయితీ ధరపై లక్షకుపైగా మట్టి గణపతులంటూ ప్రచారం
- ఇప్పటికీ విక్రయ కేంద్రాల వివరాలు ప్రకటించని పీసీబీ
- అధికారుల వద్ద కనీస సమాచారం కరవు

ఈనాడు, హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ విషయంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. గణేశ్ ఉత్సవాలకు అవసరమైతే లక్ష కాదు... రెండు లక్షల విగ్రహాలైనా పంపిణీ చేసేందుకు వెనుకడుగు వేయబోమని అధికారులు ఘనంగా ప్రకటించారు. ధరలో రాయితీ ఇస్తామన్నారు. తీరా పండగ సమీపించాక చడీచప్పుడు లేదు. రేపే పండగ... ఇప్పటికీ పంపిణీ కేంద్రాలెక్కడో ప్రకటించలేదు. ప్రజలు ఆ సమాచారం కోసం ఆరా తీస్తున్నా స్పందన కొరవడింది. పోనీ..విగ్రహాలను తయారు చేయించలేదా అంటే అదీ కాదు.

భాగ్యనగరంలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఏటేటా విగ్రహాల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కంపు కొడుతున్న చెరువులు, కుంటలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనంతో మరింత కలుషితమవుతున్నాయి. ఈ తరుణంలో పర్యావరణ హితంగా పండగని జరుపుకునేలా నగరవాసుల్లో అవగాహన కల్పించాలని పీసీబీ నిర్ణయించింది. రాయితీ ధరపై లక్ష మట్టి ప్రతిమలను ప్రత్యేక కేంద్రాల ద్వారా అందజేయనున్నట్లుగా ప్రకటించింది. డిమాండ్‌ను బట్టి రెండు లక్షలు అవసరమైనా అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేసింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రకృతిలో లభించే వస్తువులతో సహజ రంగులను తయారు చేయించి విక్రయించనున్నట్లు వివరించింది.

పంపిణీ ఎక్కడో తెలియదు... విగ్రహాల తయారీ బాధ్యతని టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థకు ...మిగతా 4లో

నిల్చోలేక నీరసం..

- నిమ్స్‌లో రోగులకు సుదీర్ఘ నిరీక్షణ
- ఓపీ కార్డు జారీకి 7-10 నిమిషాలు
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో వివరాల సేకరణలో జాప్యం
- రద్దీకి అనుగుణంగా కౌంటర్ల కొరత



ఓపీ కౌంటర్ల వద్ద బుధవారం రోగుల రద్దీ

ఈనాడు, హైదరాబాద్
న్యూస్‌టుడే, పంజాగుట్ట

నిమ్స్‌లో ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్ రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన వారు గంటల తరబడి వరుసల్లో నిల్చుని తమ వంతు కోసం నిరీక్షించారు. వృద్ధుల అవస్థలు అన్నీఇన్నీ కావు. సాధారణ రోజుల్లో ఉదయం 8 గంటలకు ఓపీ ప్రారంభమై 12.30 గంటలకు అంతా ఖాళీ అయిపోతుంది. రోగులు తిరుగుముఖం పడుతుంటారు. బుధవారం మాత్రం ఆసుపత్రిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం మూడు గంటలు దాటినా ఓపీల్లోనే రోగులు వేచిఉండాల్సి వచ్చింది. రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయడంలో అధికారుల లోపం స్పష్టంగా కనిపించింది. ధర్మాసుపత్రి దగ్గరా ఇలా ఉండదని కొందరు అసహనానికి గురవడం కనిపించింది.

నిమ్స్‌లో సేవలను పూర్తిగా ఆన్‌లైన్ చేసేందుకు కసరత్తు సాగుతోంది. సిడాక్ సంస్థ ...మిగతా 4లో



హరిత పండగ ఆనందం నిండగా.. పచ్చదనాన్ని పెంచడంలో తామూ భాగస్వాములమవుతామంటూ ఆబిడ్స్ చాపెల్‌రోడ్డులోని స్టాన్లీ పాఠశాల, కళాశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం నిర్వహించిన హరితహారంలో విద్యాసంస్థల ప్రాంగణం, స్థానిక పాదచారుల బాటలపై మొక్కలు నాటారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు



ఇంట్లో పెంచుతున్న గంజాయి మొక్కలతో పట్టుబడ్డ ఉదయ్‌రాజ్ (గళ్ల చొక్కా వ్యక్తి)

ఉప్పల్: గుట్టుచప్పుడు కాకుండా ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని ఉప్పల్ ఆబ్కారీ పోలీసులు అరెస్టు చేశారు. రామంతాపూర్‌లోని సాయికృష్ణనగర్ కాలనీ వాసి కె.ఉదయ్‌రాజ్ (26) వద్ద గంజాయి ఉన్నట్లుగా సమాచారం అందడంతో మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీందర్‌రావు ఆదేశాల మేరకు డీటీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఉప్పల్ ఎస్సై బాలకృష్ణ ఉదయ్‌రాజ్ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో 310 గ్రాముల ఎండిన గంజాయి దొరికింది. ఇంటి ఆవరణలో 4 మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారించగా ధూల్‌పేటకు చెందిన కిషోర్‌సింగ్ నుంచి తెచ్చినట్లు చెప్పాడు. దాంతో కిషోర్‌సింగ్ ఇంట్లో దాడి చేయగా మరో 240 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. కిషోర్‌సింగ్ పరారీలో ఉన్నాడు. ఉదయ్‌రాజ్‌ను రిమాండ్‌కు తరలించారు.

హెచ్‌సీయులో గంజాయి పొట్లాలు లభ్యం!

గచ్చిబౌలి న్యూస్‌టుడే: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పలువురు విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు భద్రతా సిబ్బంది గుర్తించారు. క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో మంగళవారం సాయంత్రం ఇద్దరు విద్యార్థినులు, మరో విద్యార్థి కలిసి గంజాయి సిగరెట్ తాగుతున్నట్లు తెలిసిన భద్రతా సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఆ విద్యార్థులను వైద్యపరీక్షలకు క్యాంపస్‌లోని హెల్త్‌సెంటర్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం వరకు వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విద్యార్థుల భవిష్యతు నాశనమవుతుందనే ఉద్దేశంతో ఈ విషయాన్ని వర్సిటీ అధికారులు గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. క్యాంపస్‌లో గంజాయి దొరికిన విషయంపై హెచ్‌సీయు సెక్యూరిటీ ఇంచార్జి టి.వి.రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గంజాయి ఉందన్న సమాచారంతో దాడులు నిర్వహించిన విషయం వాస్తవమేనని, విద్యార్థుల వద్ద గంజాయి లభించలేదని తెలిపారు. కొందరు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని చెప్పారు.

గంజాయి తాగుతున్న ముగ్గురి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: గంజాయి తాగుతున్న ముగ్గురు వ్యక్తులను ఎల్బీనగర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లి గురుగోవింద్ కాలనీకి చెందిన అజిత్ సింగ్(28), గుర్బహాసింగ్(33), గోపాల్‌సింగ్(26) మంగళవారం రంగారెడ్డిజిల్లా కోర్టులకు వచ్చారు. సాయంత్రం కోర్టు బయట సర్వీసు రోడ్డు పక్కన కూర్చున్న ఈ ముగ్గురు గంజాయి తాగుతున్నారన్న సమాచారం అందుకున్న ఎల్బీనగర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద 20 గ్రాముల గంజాయి లభించింది. ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. ఆ ముగ్గురిని బుధవారం రిమాండుకు తరలించారు.

రవాణా ముఠా అరెస్టు...



పట్టుబడిన నిందితులతో పోలీసులు

ధూల్‌పేట, న్యూస్‌టుడే: నగరంలో గంజాయి రవాణా చేస్తున్న ముఠాను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. అప్పర్ ధూల్‌పేట బలరాంగల్లీకి చెందిన అమన్‌సింగ్(19), అభిషేక్ సింగ్(19), సాహిల్‌సింగ్(18) గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళ్‌హాట్ పోలీసులు పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బుధవారం దాడి చేశారు. ముగ్గురినీ అరెస్టు చేసి పెద్ద మొత్తంలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు గంజాయిని అయిదు, పది గ్రాముల చొప్పున ప్యాక్ చేసి ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల వద్ద విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠాకు గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు అజయ్‌సింగ్(30) కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.



గణపతి వేడుకలకు పటిష్ఠ భద్రత

నిమజ్జనం ఒకేరోజు పూర్తయ్యేలా చర్యలు ● ఖైరతాబాద్ గణేష్ వద్ద విస్తృత ఏర్పాట్లు

-'ఈనాడు-ఈటీవీ'తో మధ్యమండలం డీసీపీ జోయల్ డేవిస్

ఈనాడు, హైదరాబాద్

"నగరంలో ప్రజలంతా భక్తిప్రపత్తులతో గణపతి వేడుకలను జరుపుకొనేందుకు పోలీస్‌శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకూ అపశ్రుతులు చోటుచేసుకోకుండా భద్రతను కల్పించాం. కొత్వాల్ మహేందర్ రెడ్డి నేతృత్వంలో అన్నిశాఖల ఉన్నతాధికారులతో చర్చించాం. నిమజ్జనం ఒకే రోజు పూర్తయ్యేలా కొత్త విధానాన్ని తెరపైకి తీసుకువస్తున్నాం. మారియట్ హోటల్ ఎదురుగా బతుకమ్మ కుంటలో సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే వినాయకులను నిమజ్జనం చేయనున్నాం. ఇక ఖైరతాబాద్ గణేష్ వద్ద పూర్తి బందోబస్తు, భద్రత ఉంటాయి." అని మధ్య మండలం డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 25 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఖైరతాబాద్‌లో భద్రత, హుస్సేన్‌సాగర్, నెక్లెస్‌రోడ్‌లలో నిమజ్జనం.. సీసీకెమెరాలు.. వలంటీర్లు... స్వచ్ఛందసేవా సంస్థల సహకారం వంటి అంశాలపై 'ఈనాడు-ఈటీవీ'తో బుధవారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



జోయల్ డేవిస్

కమాండ్ కంట్రోల్ కేంద్రంతో... ఖైరతాబాద్ గణేష్ విగ్రహం అక్కడే రూపుదిద్దుకుంటుండడంతో సాయుధ విభాగం బలగాలు భద్రత పర్యవేక్షిస్తున్నాయి. పరిసరాలతో పాటు రైల్వేగేట్ నుంచి మింట్‌కాంపౌండ్ వరకూ సీసీ కెమెరాలు పెట్టాం. రోజూ 75వేల నుంచి లక్ష మంది వస్తారన్న అంచనాతో బందోబస్తు, బ్యారికేడ్లు ఏర్పాటు చేశాం. నిమిష నిమిషానికి స్టాటిక్, పీటీజెడ్ కెమెరాల ద్వారా పరిశీలిస్తాం. అక్కడే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని తీసుకువస్తున్నాం. దీనిని కమిషనరేట్‌లోని ప్రధాన కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేయనున్నాం. పరిసర ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టి పదివేలమంది వివరాలతో డేటాబేస్ తయారుచేశాం. అపరిచితులు వచ్చినా, కొత్తవారు అద్దెకు దిగినా సమాచారం ఇవ్వాలని సూచించాం. పదకొండోరోజు(సెప్టెంబరు4) రాత్రి నుంచే ఖైరతాబాద్ వినాయకుడిని క్రేన్‌పై తరలించేందుకు ఏర్పాట్లు చేయనున్నాం. అనంత చతుర్దశి(సెప్టెంబరు 5) మధ్యాహ్నంలోపే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాం.

ఊరేగింపుల చిత్రీకరణ

హుస్సేన్ సాగరతీరం జనసంద్రంగా మారినా సందర్శకులకు, విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు వచ్చేవారికి ఇబ్బందులు కలగండా నిఘా నేత్రాలను సిద్ధంగా ఉంచాం. మొజంజాహీ మార్కెట్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకూ ప్రధాన ఊరేగింపు మార్గాలు సహా అనుసంధాన రహదారుల నుంచి వచ్చే ఊరేగింపులను చిత్రీకరించేందుకు సంచార వాహనాలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వాణిజ్య, వ్యాపార సంస్థలతో పాటు ఇళ్లు, అపార్ట్‌మెంట్ వాసులు అమర్చుకున్న సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌రూంతో అనుసంధానిస్తాం. ఊరేగింపు సాఫీగా కొనసాగుతోందా? లేదా? ఎక్కడైనా ఎక్కువ సేపు ఆగిందా? అవాంతరాలు ఏర్పడ్డాయా? అనేది తెలుసుకుని అప్పటికప్పుడు చర్యలు చేపట్టనున్నాం. బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్, నక్లెస్‌రోడ్ వైపు వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించేందుకూ నిఘా నేత్రాలు ఉపకరిస్తాయి.

3500 మందితో బందోబస్తు

కొత్వాల్ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో నిమజ్జన వేడుకను ప్రశాంతంగా పూర్తిచేసేందుకు ఒక కమిటీ ఏర్పాటైంది. నిమజ్జన ప్రక్రియ 24 గంటల్లోనే పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టనున్నాం. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు దక్షిణమండలం పరిధిలోని వాటితో సంబంధం లేకుండా నిమజ్జనం పూర్తిచేయనున్నాం. కొత్తగా మారియట్ హోటల్ ఎదురుగా బతుకమ్మకుంటలో నిమజ్జనం చేసేందుకు నాలుగు క్రేన్లను ఏర్పాటుచేశాం. ఉత్తర మండలం డీసీపీ బి.సుమతి నిర్వాహకులతో చర్చించగా వారు అంగీకరించారు. ఊరేగింపు మధ్యలో వాహనాల్లో ఇంధనం అయిపోయినా, మొరాయించినా ఆర్టీసీ సాంకేతిక నిపుణుల బృందాన్ని అందుబాటులో ఉంచాం. ఇక క్రేన్ల వద్ద గంటకు ఎన్ని నిమజ్జనమవుతున్నాయి? ఎక్కడైనా ఆలస్యమవుతోందా? అనేది తెలుసుకునేందుకు ప్రతి క్రేన్ వద్దా సీసీ కెమెరాను ఉంటుంది. నిమజ్జనం పూర్తయ్యాక భక్తులు, వాహనాలు సురక్షితంగా తిరిగివెళ్లేలా మార్గాలను సిద్ధంగా ఉంచాం. కేవలం మధ్యమండలం పరిధిలోనే 3500 మందిని భద్రత, బందోబస్తు కోసం వినియోగిస్తున్నాం.



దారి చూపిన మట్టి గణపయ్య

మేడ్చల్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రతిమల తయారీ

శామీర్‌పేట, న్యూస్‌టుడే: కులవృత్తి కనుమరుగయ్యే తరుణంలో కుమ్మరులకు మట్టి గణపయ్య దారి చూపాడు. ఉపాధి చూపడంతోపాటు పర్యావరణ హితకారిగా నిలవనున్నాడు. మేడ్చల్ నియోజకవర్గంలో తయారైన దాదాపు 80వేల మట్టి గణేశ్ ప్రతిమలు ఈసారి హైదరాబాద్‌లో పూజలందుకోనున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. రసాయన విగ్రహాలకు ధూల్‌పేట ఎలాగో మట్టి వినాయకులకు మేడ్చల్ చిరునామాగా మారింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కాలుష్య ముప్పు పొంచి ఉండడంతో.. ప్రజలు మట్టి గణపతులపై మక్కువ చూపుతున్నారు.


మహానగరంలో మన విగ్రహాలు... నగరానికి మట్టి వినాయకులు మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచే అధికంగా తరలివెళ్తున్నాయి. శామీర్‌పేట, మేడ్చల్, శ్రీరంగవరం, పూడూరు, ఎల్లంపేట, కీసర గ్రామాల్లో రూపుదిద్దుకున్న మట్టి ప్రతిమలే మహా నగరంలో ప్రత్యేక పూజలు అందుకోనున్నాయి. శామీర్‌పేట మండలంలో 6 నుంచి 18 అంగుళాల ఎత్తు మట్టి ప్రతిమలను తయారు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కాలుష్య నియంత్రణ బోర్డు, ఎంజీఓసీలకు దళారుల ద్వారా ఇక్కడి విగ్రహాలు వెళ్తున్నాయి.

కుటీర పరిశ్రమగా ప్రోత్సహించాలి... ఆధునిక జీవన శైలిలో మట్టి కుండల వాడకం తగ్గిపోవడంతో.. కులవృత్తినే నమ్ముకున్న వారి జీవితాలు దుర్భరంగా మారాయి. మట్టి గణపయ్య రాకతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ప్రోత్సహించి నగరానికి సరిపడా మట్టి వినాయకులను అందించేందుకు ఈ రంగాన్ని కుటీర పరిశ్రమగా గుర్తించాల్సిన అవసరం ఉంది. కులవృత్తులకు ఉపాధి, పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

రసాయనాలు వద్దు... రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హాని చేయడంతోపాటు జీవులపై అనేక దుష్ప్రభావాలు చూపుతున్నాయి. రసాయనాలతో తయారు చేసే విగ్రహాల జోలికి వెళ్లకుండా మట్టివి ప్రోత్సహిస్తే ఉత్పత్తిదారులకు ఉపాధి, పర్యావరణానికి ప్రయోజనం ఉంటుంది. అందరూ ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు చేట్టాల్సిన అవసరం ఉంది.







పుట్టుకొచ్చిన మొక్కలు.. కట్టడాలకు తిప్పలు

చార్మినార్‌కు సమీపంలో ఉన్న కమాన్‌లపై ఇలా మొక్కలు పెరిగాయి. ఇవి ఆయా కట్టడాలకే ప్రమాదకరంగా మారాయని, తొలగించాలని సందర్శకులు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై సర్పంచికి నోటీసులు

ఈనాడు-హైదరాబాద్; నార్సింగి, న్యూస్‌టుడే: నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ గ్రామ పంచాయతీ సర్పంచి గంగిని హరికృష్ణకు జిల్లా అధికారయంత్రాంగం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లోగా ఆయన సమాధానం చెప్పాలని అందులో కోరారు. హరికృష్ణ సుమారు రూ.98.48లక్షలు దుర్వినియోగం చేసాడని కొందరు వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. అలాగే మరో రూ.2.18కోట్ల వ్యయానికి సంబంధించి కూడా సభ్యులు అభ్యంతరాలతో కూడిన ఫిర్యాదును జిల్లా అధికారులకు అందజేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి నేతృత్వంలో విచారణ నిర్వహించారు. సభ్యులు చేసిన ఆరోపణలు వాస్తవమేనని అధికారులు గుర్తించారు. ఈమేరకు సర్పంచికి నోటీసులిచ్చినట్లు బుధవారం ఈవోపీఆర్డీ భిక్షం తెలిపారు.



75 అడుగుల కండువా, జంధ్యం ప్రదర్శిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్ వినాయకుడికి కండువా, జంధ్యం సిద్ధం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ వినాయకుడికి 75 అడుగుల కండువా, జంధ్యం సిద్ధమయ్యాయి. ఏటా వాటిని సమర్పిస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం ఈసారి కూడా సిద్ధం చేయించింది. ఆ వస్త్రాలను బుధవారం సంఘం ప్రతినిధులు కడారి శ్రీధర్, గుర్రం కొండయ్య, ఏలే స్వామి ప్రదర్శించారు. శ్రీధర్ మాట్లాడుతూ కండువా, జంధ్యం సమర్పించడంతో పాటు ఇరువైపులా గల సదాశివుడు, కుమారస్వామికి పది అడుగుల చొప్పున కండువా, గాయత్రిలను, చండీ మాతకు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలు ఇస్తున్నట్లు వివరించారు. 25న ఉదయం 7 గంటలకు భారీ ర్యాలీగా చేరుకుని సమర్పించనున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న మాటున గంజాయి

● శంషాబాద్‌లో రూ.30లక్షల విలువైన సరకు పట్టివేత ● విశాఖ నుంచి తీసుకువస్తున్న అయిదుగురి అరెస్టు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా నుంచి హైదరాబాద్‌కు కారులో పెద్ద ఎత్తున తీసుకువస్తున్న గంజాయిని పట్టుకోవడంతోపాటు అయిదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం రూ.30లక్షల విలువ చేసే 3 క్వింటాళ్ల గంజాయి, రెండు కార్లు, 6 చరవాణులు, రూ.4250 నగదును స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ జోన్ డీసీపీ పద్మజ తెలిపిన వివరాల ప్రకారం...విశాఖపట్నం జిల్లా చింతపల్లి మండలం తోటమామిడి గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు కొంతకాలంగా సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు చెందిన పరశురాంకు సరఫరా చేస్తున్నాడు. బాహ్యావలయ రహదారి మీదుగా రాత్రి సమయంలో గంజాయిని తరలిస్తున్నట్లు వారం క్రితం సైబరాబాద్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. స్పెషల్ ఆపరేషన్ టీం, సెంట్రల్ క్రైం స్టేషన్, ఆర్జీఐఏ పోలీసులు నిఘా పెట్టారు. తంబేలి చందర్‌రావు(24)(చింతపల్లి మండలం కొదుగుమామిడి), జొక్కన్న శ్రీను(29)(తుని మండలం కుమ్మరిలోవ), బొంతల నాగు(29)(మూలగరువు)లు కలిసి నర్సీపట్నంలో ఏపీ31టీజీ1883 నంబరుగల బొలేరో కారులో 11 సంచుల్లో 3 క్వింటాళ్ల గంజాయిని నింపారు. అనుమానం రాకుండా దానిపై మొక్కజొన్న కంకులను నింపి హైదరాబాద్‌కు బయలుదేరారు. బాహ్యావలయ రహదారిపై పోలీసుల తనిఖీలు ఉన్నదీ లేనిదీ వీరికి ఎప్పటికప్పుడు సంగారెడ్డి జిల్లా శ్రీగపూర్‌కు చెందిన చౌహన్ వెంకట్(29), నగిలిగిద్ద మండలం ఎంకపల్లికి చెందిన చౌహన్ మోహన్(20)లు ఇండికా కారులో తిరుగుతూ సమాచారమిస్తుంటారు. వీరు సూర్యాపేట వెళ్లి అక్కడినుంచి బొలేరో కారును వెంటతీసుకుని వస్తున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి శంషాబాద్ వద్ద తొలుత ఇండికా కారును ఆపారు. అదే క్రమంలో వెనుకే గంజాయితో వచ్చిన వాహనం పట్టుబడింది. స్వాధీనం చేసుకొని ఆర్జీఐఏ ఠాణాకు తరలించి నిందితులను అరెస్టుచేశారు. పరారీలో ఉన్న లక్ష్మణ్‌రావు, పరశురాం, తెంబెలి సురేష్ (బొలేరో కారు యజమాని) కోసం రెండు బృందాలను రంగంలోకి దించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న డీసీపీ పద్మజ

లారీని ఢీకొన్న బస్సు: పలువురికి గాయాలు

చౌటుప్పల్ గ్రామీణం: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి పది గంటలకు ఆర్టీసీ గరుడ బస్సు (ఏపీ16జెడ్0477) బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు దండు మల్కాపురం వద్ద బస్సు డ్రైవర్ వేమన అంకన్నబాబు ముందు వెళుతున్న లారీని దాటే క్రమంలో అదుపు తప్పి వెనుక నుంచి ఆ వాహనాన్ని ఢీకొట్టాడు. బస్సులో ఉన్న మణికొండకు చెందిన పొట్లూరి రమాదేవి (56), బండ్లగూడకు చెందిన టెతని ఫణికుమార్ (38)తోపాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పండగ రేపే.. పంపిణీ ఊసేదీ?

(మొదటి పేజీ తరువాయి) అప్పగించింది. సదరు సంస్థ సకాలంలోనే రంగంలోకి దిగి పని ప్రారంభించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుకున్న సమయానికే సహజ రంగులను సిద్ధం చేసింది. ఇంతవరకు అంతా బాగానే జరిగింది. పంపిణీ కేంద్రాల విషయాన్ని మాత్రం పీసీబీ అధికారులు మరిచిపోయారు. అసలు ఆ జాబితాను సిద్ధం చేశారో లేదో కూడా తెలియని పరిస్థితి. మట్టి విగ్రహాల వాడకంపై నామమాత్రంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. తయారీదారులకు ప్రత్యేక కార్యశాలల నిర్వహణ దాదాపుగా కాగితాలకే పరిమితమైందని చెప్పొచ్చు. పండగకు ఇక ఒకరోజే మిగిలి ఉన్నా విగ్రహాలను ఎక్కడ పంపిణీ చేయనున్నారో ఇప్పటి వరకు అధికారులకే తెలియదు. ఈ విషయంపై ఏ అధికారినైనా సంప్రదిస్తే మాకు తెలిస్తే కదా మీకు చెప్పడానికి అంటూ సమాధానం ఇస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆయా కేంద్రాలను ఎప్పుడు ప్రకటిస్తారో.. నగరవాసులకు అవగాహన కల్పిస్తారో పీసీబీ యంత్రాంగానికే తెలియాలి.

సామాన్యులకు అందేనా?.. గతంతో పోలిస్తే నగరవాసుల్లో మార్పు వచ్చింది. పర్యావరణహితంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈఏడాది సహజ రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను పూజించాలని చాలామంది నిర్ణయించుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో వీట ధర ఎక్కువగా ఉండడం... పీసీబీ 8 అంగుళాల నుంచి 5 అడుగుల ప్రతిమలను రాయితీ ధరపై ఇస్తామంటూ ప్రకటించడంతో సంతోషించారు. ఎక్కడ.. ఎవర్ని సంప్రదించాలనే వివరాలు తెలియకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కనీసం చవితికి రెండ్రోజుల ముందైనా ప్రకటిస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తే నిరాశే మిగిలింది. 'మేం ఈసారి మండపంలో మట్టి గణేశుడిని పెట్టాలనుకున్నాం. రాయితీ ధరపై ఇస్తున్నారని తెలిసి బేగంపేట్‌లోని పీసీబీ ప్రాంతీయ కార్యాలయంలో సంప్రదిస్తే.. మాకే ఇంకా ఏ సమాచారం లేదంటూ సమాధానం ఇచ్చారు' అంటూ ఓ యువజన సంఘం ప్రతినిధి 'ఈనాడు'తో వాపోయారు. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే రూ.లక్షలు ఖర్చు పెట్టి తయారు చేయించిన విగ్రహాలు సామాన్యులకు అందుబాటులో ఉంచుతారో లేదోననే సందేహం కలుగుతోందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పీసీబీలో సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్‌ను 'ఈనాడు' వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించ లేదు.

నిల్చోలేక నీరసం..

(మొదటి పేజీ తరువాయి) ఈ కొత్త సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఆన్‌లైన్ సేవలు ప్రవేశపెట్టారు. అమలుకు పకడ్బందీ ప్రణాళిక లేకపోవడంతో రోగులు తీవ్ర అగచాట్లు పడ్డారు. సాధారణ రోజుల్లో వేయి పైగా అవుట్ పేషెంట్లు వస్తుంటారు. సోమ, మంగళ, బుధవారాల్లో అదనంగా 300-500 వరకు ఈ సంఖ్య పెరుగుతుంది. పైగా ఆయా రోజుల్లో కొన్ని సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండటం రద్దీకి ఒక కారణం. వెల్లువలా రోగులు రావడంతో ఓపీ కౌంటర్లు అన్నీ గంట వ్యవధిలోనే కిక్కిరిసిపోయాయి. గతంలో నిర్ణీత రుసుం, పేరు, సంబంధిత విభాగం పేరు చెబితే చాలు వెంటనే ఓపీ కార్డు మంజూరు అయ్యేది. కొత్త సాఫ్ట్‌వేర్ నేపథ్యంలో రోగుల సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరం తలెత్తింది. ఒక్కో రోగికి 7-10 నిమిషాల సమయం పట్టడంతో వెనుక వచ్చే రోగుల తాకిడి అంతకంతకూ పెరిగిపోయింది.

అందుబాటులో సమగ్ర సమాచారం...

● కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టడంతో రోగుల వివరాలన్నీ ఇక నుంచి కంప్యూటర్‌లో నిక్షిప్తమవుతాయి. పేరు, ఊరు ఇతరత్రా సమాచారం అందుబాటులో ఉంటుంది. మున్ముందు ఆధార్‌కార్డు నంబరునూ పొందుపరుస్తారు. ● రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవల రికార్డులు అన్నీ ఆన్‌లైన్‌లో లభ్యమవడం వల్ల భవిష్యత్తులో మళ్లీ ఆసుపత్రికి వచ్చినప్పుడు రోగి పాత చరిత్ర మొత్తం వైద్యుల ముందు ఉంటుంది. ● తద్వారా మళ్లీ మళ్లీ పరీక్షలు చేయడం తప్పుతుంది. ఫలితంగా రోగికి ఎంతో ఆదా. ముఖ్యంగా నాణ్యతమైన చికిత్సలు అందించడానికి ఈ రికార్డులు దోహదం చేస్తాయి. ● ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న వెంటనే ప్రతి రోగికి సీఆర్ నంబరు కేటాయిస్తారు. పదేళ్ల తర్వాత మళ్లీ వచ్చినా సరే ఈ నంబరు కంప్యూటర్‌లో నమోదు చేస్తే చాలు... గతంలో అక్కడ పొందిన చికిత్స వివరాలన్నీ కంప్యూటర్ తెరపై ప్రత్యక్షమవుతాయి. ● రోగులు మొత్తం రికార్డులు తీసుకొని రావాల్సిన బాధ ఇక నుంచి తప్పుతుంది. ● వీడియో కాలింగ్ ద్వారా రోగికి అవసరమైన తదుపరి చికిత్సలు మొత్తం కంప్యూటర్‌లోని డేటా ఆధారంగా వైద్యులు అందించే వీలు ఏర్పడుతుంది. ● ప్రతి రోగి సెల్‌ఫోన్ నంబరునూ నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో వారికి అవసరమైన చికిత్సలు, ఔషధాలు గురించి ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. ● ఒకవేళ రోగ నిర్ధారణ పరీక్షల నివేదికలు పోయినా కంప్యూటర్‌లో నిక్షిప్తమై ఉన్నందున ఇబ్బంది ఉండదు.



మెట్రో రైల్ నిర్మాణ పనులతో వాహనదారులకు రహదారుల్లో చుక్కలు కనిపిస్తున్నాయి. ఎస్ఆర్ నగర్ నుంచి వచ్చే రూటును అమీర్‌పేట మైత్రివనం వద్ద మూసి వేయడంతో బుధవారం వాహనదారులు బారులు కనిపించారిలా..

జల్సా కోరిక జైలుకు పంపింది

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: జల్సాల కోసం ద్విచక్రవాహనదారుడ్ని దోచుకున్న వ్యక్తితోపాటు ఇద్దరు మైనర్లను బుధవారం మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. డీఐ యాదయ్య కథనం ప్రకారం.. నర్సింహారెడ్డినగర్‌లో నివసించే సామన్ (20) ఎలక్ట్రీషియన్. అతని వద్ద ఇద్దరు బాలలు (15) సహాయకులుగా పనిచేస్తారు. వీరంతా జల్సాలకు అలవాటు పడ్డారు. ఈనెల 17న రాత్రి మౌలాలి ఫ్లైఓవర్‌పై నాగారానికి చెందిన పృథ్వీరాజును అడ్డగించి కొట్టి అతని నుంచి రూ.12 వేలు దోచుకున్నారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి కోసం గాలిస్తున్న పోలీసులకు మీర్జాలగూడ వద్ద ఆ బాలలు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా పోలీసుల కంటికి చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ చోరీ వైనం వెలుగులోకి వచ్చింది. వారిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.12 వేలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలలను జువనైల్ హోంకు పంపారు.

వ్యాను చక్రాల కింద నలిగి వ్యక్తి మృతి

● పరారీలో వాహన డ్రైవర్



మృతుడు నందన్

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: తన కారును ఎందుకు ఢీకొట్టావని నిలదీసిన పాపానికి అతని ప్రాణం అనంత వాయువులో కలిపేశాడు ఓ వ్యాను డ్రైవర్. ఈదుర్ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ జగదీష్ చందర్ కథనం ప్రకారం.. నేరేడ్‌మెట్ కాకతీయనగర్‌లో ఉంటున్న కె.ఆరోగ్యనందన్(47) కారు డ్రైవర్. ఇతను బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి పాత నేరేడ్‌మెట్ చౌరస్తాలో ఉన్న టీ కొట్టు వద్ద కారు ఆపి పాలు తాగుతున్నాడు. ఈక్రమంలో వింగర్ వ్యాన్ వచ్చి అతని కారును వెనక నుంచి ఢీకొట్టింది. ఇదేంటని వ్యాన్ డ్రైవర్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో వ్యాన్ డ్రైవర్ తన బండి ఎక్కి పారిపోయే ప్రయత్నం చేయగా నందన్ వ్యానును గట్టిగా పట్టుకున్నాడు. అయితే వ్యానును వేగంగా ముందుకు కదిలించడంతో నందన్ కొంతదూరం వ్యాన్‌తోపాటు పరుగెత్తి పట్టు తప్పడంతో వెనక చక్రాల కింద పడ్డాడు. దీంతో తల నలిగి అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ డ్రైవర్ కనుమరుగయ్యాడు. స్థానికులు 108 వాహనాన్ని పిలిపించగా సిబ్బంది అతన్ని పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ ఆచూకీ కోసం సీసీ కెమెరాల చిత్రాలను పరిశీలిస్తున్నారు.


కిడ్నీ మార్పిడిలో నిబంధనల ఉల్లంఘన!

● కాంటినెంటల్ ఆసుపత్రి అంతర్గత కమిటీ సభ్యులపై కేసు

గచ్చిబౌలి న్యూస్‌టుడే: ఓ రోగి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విధానంలో నిబంధనలను ఉల్లంఘించినందుకు ఓ కార్పొరేట్ ఆసుపత్రి అంతర్గత కమిటీ సభ్యులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదుచేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో ఫిల్మ్‌నగర్‌లో ఉండే డాక్టర్ ప్రవీణ్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగంలో గత ఏడాది ఆగస్టులో వైద్యుడిగా పనిచేశారు. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్‌అక్తర్ ఉజామ్ బుయాన్(45) కిడ్నీ మార్పిడికోసం కాంటినెంటల్ ఆసుపత్రిలో చేరారు. డాక్టర్ ప్రవీణ్‌తోపాటు ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌కు చెందిన వైద్యుల కమిటీ ఆమోదం పొందాల్సి ఉన్నా.. రక్త సంబంధం విషయంలో తేడా రావడంతో ప్రవీణ్ శస్త్రచికిత్సకు అంగీకరించలేదు. ఆయన అభ్యంతరాలు పట్టించుకోకుండా గత ఏడాది సెప్టెంబరులో శస్త్రచికిత్స పూర్తిచేశారు. దీంతో ఆయన గతనెల 16న ఈ విషయంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు పోలీసులు ఆసుపత్రి అంతర్గత కమిటీ సభ్యులు హరీష్‌మీనన్, గోకుల్‌ప్రేమ్‌కుమార్, రమేష్‌కృష్ణలపై 468, 471, 420, 506 సెక్షన్ల ప్రకారం కేసు నమోదుచేశారు. కిడ్నీ మార్పిడి విషయంలో ఆసుపత్రి వైద్యులు నిబంధనలు పాటించింది. . లేనిదీ తెలుసుకునేందుకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు లేఖ రాశారు. అంతర్గత కమిటీ నివేదికలో ప్రవీణ్ సంతకం ఫోర్జరీ విషయం తెల్చేందుకు సదరు పత్రాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ తెలిపారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉందని, డీఎంఈ, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు వస్తేనే పూర్తివివరాలు చెప్పగలమన్నారు. డాక్టర్ ప్రవీణ్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కాంటినెంటల్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను నిబంధనల ప్రకారమే నిర్వహించామన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారి అనుమతితో కిడ్నీ మార్పిడి చేసినట్లు తెలిపారు.

వజ్ర బస్సుల్లోనూ టిక్కెట్ల జారీ

ఈనాడు, హైదరాబాద్: 'వజ్ర' మినీ ఏసీ బస్సుల్లోనూ టిక్కెటు తీసుకునే సౌకర్యం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కల్పించింది. ఈ బస్సులకు టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్‌లో ... మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్లు తీసుకొనే వెసులుబాటు మాత్రమే ఇప్పటిదాకా అందుబాటులో ఉంది. ఇకపై బస్సులోని డ్రైవర్ దగ్గరా టిక్కెట్ పొందవచ్చునని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ - నిజామాబాద్, హైదరాబాద్ - వరంగల్ మధ్య తిరుగుతున్న ఈ బస్సులకు ఆన్‌లైన్, యాప్ అవకాశం లేనివారు... నగర శివార్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టిక్కెట్లు పొందేవారు. ఆ టిక్కెట్ కేంద్రం దాటిన తర్వాత బస్సు ఎక్కేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పుడు డ్రైవర్ టిక్కెట్ ఇవ్వనుండటంతో ప్రయాణికులు ఏ స్టేజిలోనైనా ఎక్కే సౌలభ్యం ఏర్పడిందని అధికారులు వివరించారు. టిక్కెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని రంగారెడ్డి ఆర్ఎం గంగాధర్ తెలిపారు. హైదరాబాద్ - వరంగల్ మినీ బస్సుల్లో ధర రూ. 298, హైదరాబాద్ - నిజామాబాద్ బస్సుల టిక్కెట్ ధర రూ. 347గా పేర్కొన్నారు.



శివారు ఇంజినీరింగ్ కాలేజీల్లో భారీగా తగ్గిన ప్రవేశాలు

కళ తప్పిన.. కళాశాల!

విద్యార్థులు లేక మూతపడుతున్న వైనం


● చేవెళ్ల మండలంలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో అయిదారేళ్ల క్రితం సీటు దొరకాలంటే కష్టంగా ఉండేది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు రూ.లక్షల్లో పలికేది. అంత డిమాండ్ ఉన్న కళాశాల.. ప్రస్తుతం విద్యార్థుల ప్రవేశాలు లేక వెలవెలబోతోంది. ఈ ఏడాది నాలుగు బ్రాంచీలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించగా ఎంసెట్ కౌన్సిలింగ్‌లో కేవలం 30 మంది ప్రవేశాలు పొందారు. మరో ఆరుగురు విద్యార్థులు మేనేజ్‌మెంట్ కోటా కింద సీట్లు పొందారు. 240 సీట్లకుగానూ 36 మంది మాత్రమే చేరడం విశేషం. దీంతో తరగతులు ఎలా నిర్వహించాలో తెలియక యాజమాన్యం సందిగ్ధంలో పడింది.

● చేవెళ్లలోని మరో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో గత మూడేళ్లుగా విద్యార్థుల ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ఏడాది అన్ని కోర్సుల్లో కలిపి 20 మంది లోపే ప్రవేశాలు పొందారు. కొన్నేళ్ల కిందట వేయి మందికిపైగా విద్యార్థులతో కళకళలాడిన క్యాంపస్.. ఇప్పుడు కళతప్పింది.

● మరో ఇంజినీరింగ్ కళాశాలదీ అదే పరిస్థితి. మూడేళ్లుగా స్థానిక విద్యార్థులెవరూ చేరకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులను తెప్పించి మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు భర్తీ చేసుకొని నెట్టుకొస్తున్నారు. ఈ ఏడాది కౌన్సిలింగ్‌లో 10 మంది మాత్రమే చేరారు. మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ఇతర రాష్ట్రాల విద్యార్థుల వైపు చూస్తున్నారు.

చేవెళ్ల, న్యూస్‌టుడే

ఇంజనీరింగ్‌కు క్రేజ్ ఉన్న కొత్తలో చేవెళ్లలో ఏర్పాటైన ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మూడేళ్లుగా విద్యార్థుల ప్రవేశాలు లేక మూతపడింది. గతేడాది తాము ఇక ఇంజనీరింగ్ కోర్సులు నడపలేమని చేతులెత్తేసిన యాజమాన్యం అనుమతులన్నీ రద్దు చేసుకుంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా మారడంతో దాంట్లో మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రయత్నాల్లో ఉంది. ఇంజనీరింగ్ చేయాలంటే ఒకప్పుడు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపేవారు. నగర శివారు మండలాల్లో 150కిపైగా కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపు తీసుకున్న విద్యార్థుల్లో 80శాతం మంది ఇంజినీరింగ్ చేయడానికే ఆసక్తి చూపడంతో డిగ్రీ కోర్సుల్లో సీట్లు భర్తీ అయ్యేవి కావు. ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లకు భలే డిమాండ్ ఉండేది. ఒక్కో సీటుకు రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు డొనేషన్‌లు తీసుకునేవారు. ఇదంతా గత వైభవం. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఇంజనీరింగ్ కళాశాలలు ప్రస్తుతం విద్యార్థుల్లేక కళావిహీనంగా మారాయి. కొన్ని కళాశాలలైతే ఏకంగా మూతపడ్డాయి. మరికొన్ని కళాశాలలను మూసి వేయలేక చేరిన అరకొర విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారు లేకపోవడంతో కొన్ని చోట్ల పాలిటెక్నిక్ కోర్సులు ప్రవేశపెట్టి నడిపిస్తున్నారు. ఒక్క చేవెళ్ల మండలంలోనే ఐదు ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. మరో మూడు కళాశాలల్లో ఇతర కోర్సులు ప్రవేశపెట్టాయి. మరో నాలుగు కళాశాలల్లో ఈ ఏడాది నిర్వహించిన ఎంసెట్ కౌన్సిలింగ్‌లో పదుల సంఖ్యలోనే సీట్లు భర్తీ అయ్యాయి.



సరైన సౌకర్యాలు లేకుండానే.. నగర శివారు మండలాల్లో ఏర్పాటైన ఇంజినీరింగ్ కళాశాలల్లో సగానికిపైగా సరైన సౌకర్యాలు లేకుండా కొనసాగుతున్నట్లు మూడేళ్ల క్రితం ప్రభుత్వం నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా అధ్యాపకులు, ల్యాబ్‌లు, కళాశాలలో ప్రాంగణ నియామకాలకు అవకాశాలు లేకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల అదే కళాశాలలో ఎంటెక్ చదువుతున్న విద్యార్థులను బీటెక్ ప్రొఫెసర్‌లుగా నియమించుకున్నట్లు గుర్తించారు. నిబంధనలు పాటించని ఆయా కళాశాలలకు అప్పట్లో ప్రభుత్వంఅనుమతులు నిరాకరించింది. అధ్యాపకులను పూర్తి స్థాయిలో నియమించుకోవడంతోపాటు నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉంటేనే అనుమతులిస్తామని ప్రభుత్వం తేల్చిచెప్పింది. చాలా కళాశాలలకు ఒకటి రెండు బ్రాంచిలకే అనుమతులిచ్చి మిగిలిన బ్రాంచీలకు అనుమతి ఇవ్వలేదు.

హాజరు ఉంటేనే.. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులకు 75శాతం హాజరు ఉంటేనే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. అలాగే విద్యార్థులు, అధ్యాపకులకు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించింది. ఉపకార వేతనాల మంజూరులో నిబంధనలు అమలు చేస్తుండటంతో విద్యార్థులు బీటెక్‌లో చేరడానికి వెనుకంజ వేశారు. అలాగే ఇంజినీరింగ్ ప్రాభవం తగ్గడంతో డిగ్రీ, పాలిటెక్నిక్, బీబీఎం వంటి కోర్సులకు డిమాండ్ ఏర్పడింది.

ప్రత్యామ్నాయంపై దృష్టి... ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గినందున యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాయి. చేవెళ్లలోని ఓ కళాశాల యాజమాన్యం ఇంజినీరింగ్ అనుమతులు రద్దు చేసుకొని అగ్రి బిజినెస్, పాలిటెక్నిక్ కోర్సులను ప్రవేశపెట్టింది. మరో కళాశాల డిప్లొమా, పాలిటెక్నికల్ కోర్సులతో నెట్టుకొస్తోంది. ఇంజినీరింగ్‌తో పోలిస్తే ఇతర కోర్సులకు డిమాండ్ ఏర్పడటంతో కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంపై దృష్టి సారిస్తున్నాయి.

స్థానికుల ఉపాధికి దెబ్బ

చేవెళ్ల మండలంలో గతంలో 12 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా నిత్యం ఇతర ప్రాంతాల నుంచి సుమారు 20వేల మందికిపైగానే విద్యార్థులు రాకపోకలు సాగించేవారు. పట్టణం విద్యార్థులతో కళకళలాడుతూ కనిపించేది. ప్రస్తుతం నాలుగైదు కళాశాలలే నడుస్తున్నా.. అందులో విద్యార్థులు లేరు. గతంలో అద్దె ఇళ్లకు డిమాండ్ ఉండేది. అప్పట్లో ఏర్పాటు చేసిన నాలుగు ప్రైవేటు హాస్టళ్లు ప్రస్తుతం మూతపడ్డాయి. ఇంజనీరింగ్ కళాశాలల్లో స్వీపర్‌లు, అటెండర్లు, సూపర్‌వైజర్‌లు, వాచ్‌మెన్‌లుగా స్థానికులకు ఉపాధి దొరికేది. ప్రస్తుతం వారు ఉపాధికి దూరమయ్యారు.



చేవెళ్లలో మూత పడిన ఓ కళాశాల



విగ్రహాన్ని గవర్నర్‌కు అందిస్తున్న ప్రవీణ్‌రావు

గవర్నర్‌కు సహజ రంగుల గణపతి అందజేత

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: సహజ రంగులతో తయారుచేసిన గణేష్ విగ్రహాలను పూజించాలని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ పిలుపునిచ్చారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని గృహవిజ్ఞాన విభాగం తయారుచేసిన సహజరంగుల గణపతి విగ్రహాన్ని మంగళవారం ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు గవర్నర్‌కు అందజేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా ఈ తరహా విగ్రహాలను తయారు చేసే ప్రక్రియకు గత యేడాది శ్రీకారం చుట్టాయి. పర్యావరణం, ప్రకృతికి విఘాతం కలగకుండా ఇలాంటి విగ్రహాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు.

పర్యావరణ హితానికి మేము సైతం..



పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషిచేస్తామంటూ ముందుకు వచ్చారు గ్యాప్ ఇంక్ సంస్థకు చెందిన 50మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. బుధవారం కొత్వాల్‌గూడ వద్ద అటవీ ప్రాంతంలో శంషాబాద్ రేంజ్ అటవీశాఖ అధికారి హరిమోహన్ రెడ్డి పర్యవేక్షణలో వందల సంఖ్యలో మొక్కలు నాటారు.

– న్యూస్‌టుడే, శంషాబాద్ గ్రామీణ



మురుగు మళ్లింపు..

ఎన్టీఆర్ మార్గ్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బాగు పరిచేందుకు నీటి మళ్లింపు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రహదారి పక్కన ప్రత్యేకంగా గొట్టపు మార్గం నిర్మించి.. తర్వాత భూగర్భ డ్రైనేజీని శుభ్రపరచనున్నారు.

రాజేంద్రనగర్

శంషాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మార్కెట్‌లో బుధవారం కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కిలో టమోటా రూ.50, ఆలుగడ్డ 25, బెండకాయలు 45, దొండకాయలు 20, దోసకాయ 30, చిక్కుడు 45, సొరకాయ 25, పొట్లకాయ 25, వంకాయ తెల్లవి 45, నల్లవి 30, కీరా 25, క్యాప్సికం 45, క్యారెట్ 40, క్యాబేజీ 40, పచ్చిమిర్చి 50.

పూజిద్దాం మట్టి గణపతిని!

- పెరుగుతున్న అవగాహన
- 3600 విగ్రహాలు పంపిణీ చేసిన అధికారులు



మట్టి గణేశ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే

మట్టి గణపతులను పూజించడంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఒకవైపు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ వీటితో కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. అంతేకాకుండా చిన్న సైజుల్లో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. సర్కిల్ అధికారులు ఇప్పటి వరకు 2600 మట్టి ప్రతిమలను అందించారు. ఇవన్నీ సర్కిల్‌లోని 5 డివిజన్ల కార్పొరేటర్ల ద్వారా ఉచితంగా పలువురికి అందాయి. తాజాగా బుధవారం మరో 1000 విగ్రహాలు సర్కిల్ కార్యాలయానికి వచ్చాయి. అందులో 200 ప్రతిమలను సర్కిల్ ఉద్యోగులకు పంపిణీ చేయనున్నట్లు ఉపకమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. మిగిలినవి ఆయా డివిజన్‌లలో కార్పొరేటర్ల ద్వారా పంపిణీచేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. మట్టి గణపతులను పూజించే విధంగా విద్యార్థులకు సూచించాలని గడిచిన 15 రోజులుగా వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు సర్కిల్ అధికారులు సూచించారు. విద్యార్థుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తే తగిన ఫలితం ఉంటుందని అధికారుల ఆలోచన. అలానే పలు పాఠశాలల్లో తయారు చేయించే కార్యక్రమానికీ ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం

మట్టి ప్రతిమలను పూజించాలని అధికారులు చేస్తున్న ప్రయత్నానికి స్వచ్ఛంద సంస్థలు చేయూతను ఇస్తున్నాయి. జనహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గడిచిన నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాలలో విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. రసాయన రంగులు వాడిన విగ్రహాలను పూజించడం ద్వారా కలిగే దుష్పరిణామాలను వారు వివరిస్తున్నారు. సర్కిల్‌లో క్వాడ్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఇటీవల పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక ప్రచారం చేశారు. మట్టి గణపతులను మాత్రమే పూజించాలని వారు చేసిన ప్రచారం ఆకట్టుకుంది. హైదర్‌గూడలోని ఓ ప్రైవేట్ ఆర్ట్ పాఠశాలలోనూ విస్తృతంగా ప్రచారం చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారుచేసి వాటిని పూజిస్తామని తెలిపారు. అత్తాపూర్, హైదర్‌గూడ, లక్ష్మీనగర్ తదితర అపార్ట్‌మెంట్‌లలోను విద్యావంతులు ఆసక్తి చూపిస్తున్నారు.

చైతన్యం పెరిగింది:

విజయలక్ష్మి, ఉపకమిషనర్

గతంతో పోలిస్తే మట్టి గణేష్ విగ్రహాలను పూజించడంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఈ యేడు చాలామంది తమకు ఆ విగ్రహాలు కావాలని సంప్రదిస్తున్నారు. జీహెచ్ఎంసీతో పాటు పలువురు స్వచ్ఛందంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జనహిత స్వచ్ఛంద సంస్థ

భాజపా కార్యవర్గానికి ప్రతినిధుల ఎంపిక



ఉత్తర్వులు అందజేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ భాజపా నాయకులు పలువురిని బుధవారం పార్టీ అధినాయకత్వం వివిధ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గం కన్వీనర్‌గా హైదర్‌గూడకు చెందిన మోండ్ర కొమరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ప్రేమావతిపేట్‌కు చెందిన బండి ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఇంద్రానగర్‌కు చెందిన పాండురంగారావు నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర భాజపా అధ్యక్షులు లక్ష్మణ్ వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

'అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి'



అవగాహన కల్పిస్తున్న ప్రజ్వల సంస్థ ప్రతినిధులు

శంషాబాద్ గ్రామీణ: మాయ మాటలతో అభం, శుభం ఎరుగని పిల్లలను అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకొంటున్న అసాంఘిక శక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రజ్వల స్వచ్ఛంధ సంస్థ కోఆర్డినేటర్ పి.నరేష్ అన్నారు. బుధవారం నర్కుడ జడ్పీహెచ్ఎస్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరేష్ మాట్లాడుతూ.. పేదరికాన్ని ఆసరాగా చేసుకొని అమాయక పిల్లలను ప్రేమిస్తున్నామంటూ, ఉద్యోగం ఇప్పిస్తామంటూ, సినిమాలో అవకాశం కల్పిస్తామంటూ ఎర వేసి మానవ అక్రమ రవాణా చేయడం నేటి సమాజంలో సర్వసాధారణంగా మారిందన్నారు. ఇటువంటి 18వేల మంది బాధితులను కాపాడి జీవనోపాధి కల్పించిన ఘనత ప్రజ్వల సంస్థ కే దక్కిందన్నారు. ఆడ పిల్లల సంరక్షణ కోసం నిరంతరం కృషి చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు రాంరెడ్డి, జంగయ్య, పాల్గొన్నారు.

రైతు సదస్సుపై గోడపత్రిక ఆవిష్కరణ

మణికొండ, న్యూస్‌టుడే: కూరగాయల రైతుల సమస్యలపై ఈ నెల 28న తుక్కుగూడలో రైతు పంచాయతీ సదస్సు నిర్వహిస్తున్నట్లు భాజపా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి పాపయ్య తెలిపారు. బుధవారం ఖానాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్‌మోర్చా నాయకులు నర్సింహదాస్, బోజిరెడ్డి, అంజన్‌కుమార్, అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, కొమరయ్య, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, లక్ష్మినారాయణ, నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మట్టి గణపతుల పంపిణీ

మణికొండ, న్యూస్‌టుడే: గణేష్ నవరాత్రుల్లో భాగంగా గురువారం మణికొండ, పుప్పాలగూడ గ్రామాల్లో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బచపన్ పాఠశాల డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. 3 వేల మట్టి వినాయక ప్రతిమలను స్థానికులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

అన్ని వర్గాలకు కాంగ్రెస్ అండ: సబితారెడ్డి

నార్సింగి: కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందని మాజీ హోంమంత్రి సబితారెడ్డి అన్నారు. గండిపేట మండలం బండ్లగూడ గ్రామానికి చెందిన బి.గోపాల్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో 150 మంది కార్యకర్తలు బుధవారం సబితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. వినాయక చవితి తర్వాత పార్టీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకుని ఊరూరా జెండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. సీనియర్ నాయకులు సహదేవ్‌గౌడ్, చాంద్‌పాషా, యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు సాగర్‌గౌడ్, సూరీగౌడ్, సంగారెడ్డి, సందీప్, అశోక్, వెంకటాచారి, శశికుమార్, బి.నరేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో సబితారెడ్డి

- కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, కౌసర్, రాజేశ్, ఫెరోజ్, క్రిష్ణాయాదవ్, కర్ణాగౌడ్, గిరిగౌడ్‌ల ఆధ్వర్యంలో దాదాపు 60 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకులు నవాబ్‌ముంతాజ్, సహదేవ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నదుల పరిరక్షణ కోరుతూ ర్యాలీ



ర్యాలీలో ప్రిన్సిపల్ చంద్రమోహన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు

నార్సింగి, న్యూస్‌టుడే: గండిపేట సమీపంలోని ఎంజీఐటీ కళాశాల, లయన్స్‌క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో బుధవారం నదుల పరిరక్షణ(సేవ్‌రివర్) ర్యాలీ నిర్వహించారు. చెరువుల రక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ప్రిన్సిపల్ జి.చంద్రమోహన్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించగా, లయన్స్‌క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు విజయలక్ష్మి, రమాదేవి, కళాశాల అధ్యాపకులు రవిచందర్ పాల్గొన్నారు.

పోచమ్మ, నాగదేవత ఆలయాల వద్ద పూజలు

నార్సింగి: గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామంలో పునఃనిర్మిస్తున్న పోచమ్మ, నాగదేవత ఆలయాల వద్ద బుధవారం గ్రామ సర్పంచి పూపల్లి క్రిష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థపతి సయ్యద్ మునవర్ బాషా ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంపైన గోపురాలకు బ్రహ్మకపాల పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు యెట్టయ్య ముదిరాజ్, బాల్‌రాజ్, లక్ష్మణ్, వనజ, వెంకటమ్మ, శ్రీనివాస్, ముత్తయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మూగ జీవాలను తరలిస్తే కఠిన చర్యలు

శంషాబాద్ గ్రామీణ,న్యూస్‌టుడే: వినాయక చవితి, బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకొని రహదారులపై పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. శంషాబాద్, ఆర్జీఐఏ ఠాణాల పరిధిలోని జాతీయ, రాష్ట్రీయ రహదారుల పై పోలీసులు ఏర్పాటు చేసిన 8 చెక్ పోస్టులను బుధవారం శంషాబాద్ జోన్ డీసీపీ పద్మజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలమాకుల వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేసే తీరు, సిబ్బంది వ్యవహరించే విధానంపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, బక్రీద్ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి ప్రతి ఒక్కరు పరస్పరం సహకరించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో మూగ జీవాలను తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



పాలమాకుల చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీసీపీ పద్మజ

జీవాలను మార్కెట్‌కు తీసుకురావద్దు

బక్రీద్ పండగను అంతా కలిసిమెలిసి ప్రశాంతవాతావరణంలో చేసుకోవాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ జీవీ రమణగౌడ్ కోరారు. బుధవారం నార్సింగి మార్కెట్‌కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌తో కలిసి పాల్గొన్నారు. రమణగౌడ్ మాట్లాడుతూ పండగ సందర్భంగా వ్యాపారులు పశువుల సంతకు ఆవులను, దూడలను తీసుకురావద్దని స్పష్టం చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ పత్తి ప్రవీణ్, ఉపసర్పంచి నజీర్, ఎంఐఎం నాయకులు ముఖ్తార్‌పాషా పాల్గొన్నారు.

రాజేంద్రనగర్

మెహిదీపట్నం రైతుబజార్‌లో కూరగాయల ధరలు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: (బుధవారం ధరలివి. కిలో రూ.లో) టమాట 43, వంకాయలు 25, బెండకాయలు 25, పచ్చిమిర్చి 23, కాకరకాయ 18, బీరకాయ 18, క్యాబేజీ 16, బీన్స్ 33, క్యారెట్ 41, దొండ 18, చిక్కుడుకాయలు 43, గోకరకాయ 18, బీట్‌రూట్ 18,, క్యాప్సికం 31, ఆలుగడ్డ 14, ఉల్లిగడ్డ 26,పొట్లకాయ 13, కంద 21, కీరా 11త, చామగడ్డ 25.

నీటి లీకేజీలతో అవస్థలు



చౌదరిగూడలో బోరు బావి వద్ద లీకేజీ అవుతున్న ప్రాంతం

శంషాబాద్ గ్రామీణ,న్యూస్‌టుడే: భూగర్భం నుంచి ప్రజల అవసరాల కోసం తోడుకుంటున్న ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది. గ్రామ ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్న పైపులు అడుగడుగునా పగిలిపోయి నీరు వృథా అవుతున్నా పంచాయతీ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. చౌదరిగూడకు మంచి నీటిని సరఫరా చేస్తున్న బోరుబావి కి.మీ దూరంలో ఉంది. బోరు బావి వద్ద పైపు లీకేజీ కావడంతో నీరంతా వృథాగా పోతుంది. దీంతో గ్రామానికి అరకొరగా మాత్రమే నీరు వస్తుంది. లీకేజీలను సరిదిద్దాలంటూ పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకునేవారని కరవయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పెద్దషాపూర్ గ్రామం నడిబొడ్డున ప్రధాన రహదారిపై మంచినీటి పైపులైన్ చాలారోజులుగా లీకేజీ కావడంతో మురికి గుంటగా మారడమే కాకుండా రహదారిపై పారడంతో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. బోరు మోటార్ కట్టేస్తున్నపుడు మురుగంతా మంచి నీటి పైపులైన్ల లోకి వెనక్కి వెళ్లిపోతుంది. బోరు మళ్లీ వేసినపుడు మురుగు నీటితో పాటు మంచి నీళ్లు వస్తున్నాయంటు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైపులను మరమ్మతులు చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలంటూ స్థానికులు కోరుతున్నారు.



పెద్దషాపూర్‌లో మంచి నీటి పైపులైన్ లీకేజీ కావడంతో రహదారిపై ఇలా

గురుకుల టీచర్ల హిందీ మోడల్ పరీక్షకు స్పందన

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: హిందీ సేవా సదన్ ఆధ్వర్యంలో గురుకుల టీచర్ల టీజీటీ, పీజీటీ హిందీ మెయిన్ పేపర్, పేపర్-2లను మోడల్ పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఈ మేరకు హిందీ సేవా సదన్ వ్యవస్థాపకులు ఎస్. గైబువల్లీ చేతుల మీదుగా ఆబిడ్స్ స్టేషన్ రోడ్డులో ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మోడల్ పరీక్షల వల్ల గురుకుల టీజీటీ, పీజీటీ హిందీ మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష రాసే విధానం, సమయ పాలన, పోటీ పరీక్షలపై ఉండే భయం తొలగిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు శ్రీనివాసులు, హాజీవల్లీ, ఇంతియాజ్, వినోద్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై నేడు సదస్సు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహిస్తున్నట్లు మీరాలం ఎలక్ట్రికల్ ఏడీఈ అన్నయ్య తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఇక్కడికి వచ్చి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రేమ్‌సింగ్‌రాథోడ్‌కు అభినందనల వెల్లువ

అబిడ్స్, న్యూస్‌టుడే: గోషామహల్ సెగ్మెంట్ (పాత మహారాజ్‌గంజ్) మాజీ ఎమ్మెల్యే, తెరాస నేత ప్రేమ్‌సింగ్‌రాథోడ్ బుధవారం మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని అభినందనలతో ముంచెత్తారు. గోషామహల్ నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రీ, మంగళ్‌హాట్, గోషామహల్ కార్పొరేటర్లు మమత గుప్త, పరమేశ్వరీసింగ్, ముఖేశ్‌సింగ్‌లతో పాటు పార్టీ నేతలు నందకిషోర్‌వ్యాస్, ఆర్వీ మహేందర్, శీలం సరస్వతీ, ఎస్. ధన్‌రాజ్ మాదిగ, శాంతిదేవీ అక్క, రాజుసింగ్, ప్రియాగుప్త తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విగ్రహానికి తప్పిన ముప్పు!

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ధూల్‌పేట నుంచి టప్పాచబుత్ర మీదుగా ఆసిఫ్‌నగర్ వైపు వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న ఓ ట్రాలీ చక్రాలు ఊడిపోయాయి. నడిరోడ్డులో సంఘటన జరగడంతో విగ్రహం ఓ వైపు ఒరిగిపోయింది. మండప నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే రంగంలోకి దిగిన టప్పాచబుత్ర పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, భారీ క్రేన్ రప్పించారు. క్రేన్ సహాయంతో భారీ వినాయక విగ్రహాన్ని మరో వాహనంలో తరలించారు.



ఊడిపోయిన చక్రాలు

IRON & CEMENT, EYE CARE, COOKING, FLOORINGS, YOGA & MEDIATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURIERS, DRIVING SCHOOLS, TAILORING, YOGA & MEDIATION, BEAUTY PARLOUR, DIABETIES

EENADU CLASSIFIEDS

THE EENADU WAY CLASSIFIEDS

CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESSCELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

BUSINESS SERVICES

BUSINESS OFFER

మావద్ద కంచిపట్టు, బెనారస్,ఉప్పాడ, లెగ్గిన్స్, చున్నీస్, పెటికోట్స్, నైటీస్, ఇక్కత్‌పట్టు, గద్వాల్, నారాయణపేట, కలకత్తా, వర్క్‌శారీస్, సూరత్, డిజైనర్‌శారీస్, మరియు, రేమండ్స్, సియరామ్స్, లెనిన్ అన్నిరకములు వస్త్రములు, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కాస్ట్‌కి లభించును Opp, మహంకాళీ టెంపుల్ sec-bad ✆ 8498900930, opp అంజలి థియేటర్, జనరల్‌బజార్ 9666478363

PACKERS & MOVERS

SAILAXMI PACKERS & Movers Local & All Over India DSNR: 9391072529, KP: 9394428929, Sec: 9032028929, Vij, Vzg, Chennai, Bng, Puna.

BEAUTY PERSONAL CARE

BEAUTY PARLOUR

"Mirrors Academy" Ofers Career Oriencted Courses with Placement Hairdressing with "LOREAL" make up with "KRYOLAN" NailArt with "NUBAR" of USA & Beauty By MIRRORS. ✆ 9618991818.

HOME NEEDS

PEST CONTROL

Golden Pest Control Termit TRMT- 2B/R 2,000/- 3B/R- 2,500/- 10Yrs Guarantee. Cockroach Bite TRMT. Ph: 9618034224/ 9676211260

తేజశ్రీ పెస్ట్‌కంట్రోల్ చెదలు, ఉడ్‌బోరర్ నివారణ 10 సం॥ గ్యారంటీ బొద్దింకలకు జెల్ ట్రీట్‌మెంట్ ఏ వస్తువు కదపనక్కర్లేదు. Rs. 1000/- ★ దేప ఈశ్వర్‌రెడ్డి ✆ 8106000303

REAL ESTATE

FLAT FOR SALE

S.Ft 2,800/- లకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (VJA), IT పార్కు వద్ద కేసరపల్లిలో RO వాటర్, సోలార్‌వాటర్, వాటర్ సాఫ్టనర్స్, జిమ్, పార్కింగ్ టైల్స్‌తో 2 & 3 BHK అపార్ట్‌మెంట్లు గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. ✆ 94401 20033, 73372 43565.

PLOT FOR SALE

తెలంగాణ తిరుపతిలాగా అభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్ట అతి సమీపంలో ఆలేరు పట్టణం దగ్గర రుత్విక హోమ్స్ వారి DTCP అప్రూవుడ్ L.P.No.37/2017/H కేవలం గజం 1999/- లకే లభించును. ఫ్రీ రిసార్ట్స్ మెంబర్ షిప్ బ్యాంక్ లోన్ కలదు.
Contact
9573346859

JOBS

బ్రాండెడ్ కాఫీషాప్ సోమాజిగూడలో పనిచేయుటకు ఆపరేటర్స్ కావలెను. జీతం: 10000/- ఇది కన్సల్టెన్సీ కాదు ✆ 8885216002.

AGRIBUSINESS

POULTRY

నిన్నటిరోజు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ఫారంగేటు ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

AYHC Pharmacy ప్రొడక్ట్స్ Hyderabad మెడికల్ షాప్స్ సప్లై/ కలెక్షన్ డిస్ట్రిబ్యూటర్స్ పెట్టుబడిపై 40% ఆదాయం 8500906282.

BUSINESS OFFER

Setup your Own Soft Skills Franchise with Min Investment & Earn Regular Income. perfectsoftskills.in ✆ 8639637042/ 9848741400

Data Entry new projects available with good payout for long term contract. Office setup mandatory with min 5-8 systems ✆ 9515098715.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. సై ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 77308 39945.

ప్లాస్టిక్ పరిశ్రమ: మెషిన్లు అమ్మకం, ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. బాలాజీ ఎం॥ప్రై॥, ✆ 95818 86892.

బిజినెస్‌లో ఇన్‌వెస్ట్‌మెంట్ పెట్టాలని అనుకున్నవాళ్ళకు మంచి అవకాశం ఖచ్చితమైన ఆదాయం సురక్షితం సంప్రదించండి. Ph: 7799600099

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 57458.

Govt Regd. నెలకు అత్యధిక సంపాదన అగర్‌బత్తి పరిశ్రమను నెలకొల్పండి. ముడిసరుకు మేమే ఇచ్చి తయారైనది కొంటాం. అగ్రిమెంట్ కలదు. ✆ 7680885134

రియల్ ఎస్టేట్ నందు ఇన్వెస్ట్‌మెంట్ చేయుటకు ఇన్వెస్టర్స్ కావలెను. మంచి ప్యాకేజ్ కలదు. సంప్ర: 9346363436

పేపర్ ప్లేట్స్ టి కప్స్ గ్లాస్ మీ ఇంటి వద్దనే తయారు చేస్తూ ఆదనంగా సంపాదించండి మిషన్స్ అమ్మకం ముడిసరుకు ఉచిత ట్రాన్స్‌పోర్ట్ బైబ్యాక్ అగ్రిమెంట్. పల్లవి పేపర్ ప్లేట్స్. Cell: 81795 38429.

BUILDING & CONSTRUCTION

BOREWELLS

Laxmipriya B/W 6 1/2 2500 Ft 4 1/2 & 5" 800 Ft 6" Under Roof 1000 Sft D/F, Rebore with High Power Latest Technology Rigs ✆ 9848045523/ 9949491555

BEAUTY PERSONAL CARE

BEAUTY PARLOUR

Wanted Trained Beauticians, Helpers- Ladies Beauty Parlour- Near Model House Hyd-82, 9885851102, 23392840

EDUCATION

HOME TUTIONS

Sairam Home Tutions Offer Exp, 1-XII SSC, CBSC, ICSC Inter, EAMCET AIEEE, IIT, B.Tech, Deg, Welcome M/F. Ph: 8328099273/ 9247315777

Sri Chaitanya Academy Top No-1 In Hyd Home/ Class Room Tutions I-XII, Inter, EAMCET/ NEET, JEE, (Mains/ Adv) Deg, MBA, B.Tech ✆ 9885734904.

క్యాపిటల్ హోమ్‌ట్యూషన్స్ KG to PG, Inter, T. EAMCET, NEET, IIT, JEE- మెయిన్స్, CA-CPT, B.Com, B.Tech, PG. వెల్‌కమ్ ట్యూటర్స్ ✆ 70362 98104.

FINANCIAL SERVICES

CHITS & DEPOSITS

శ్రీఎన్నుసత్య చిట్స్‌ఫండ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ Pvt. 5,10,20,25,40 లక్షల చిట్స్ కలవు. న్యూ & వేకెంట్ చిట్స్ కమిట్‌మెంట్ కలవు. ✆ 9396998554/ 9951613188

HEALTH CARE

WEIGHT LOSS CENTERS

5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG ల బరువు, చేతులు, తోడలు, పొట్టసైజు, మలబద్దకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళనొప్పులు తగ్గుతాయి. Ph: 9059320974

HOME NEEDS

PEST CONTROL

Om Swasthik White Ants & Woodbores Tremt. 10 Yrs Guarantee. Cockroach Gel & Spray Tremt. Rs. 499/- ✆ 9542212700, 9542212800.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I Akbar Abdul Rehman Punjani R/o 5-8-494/18A Karimabad Housing Society Chiragali Lane Hyderabad have Changed My Name as Akbar Punjani from Further for Passport - Purpose

LOST

I Mohammed Jameel S/o Late, Mohammed Mahboob R/o. H.No. 13-1-476, Allah Banda, Razdhar Khanpet, Mangalhat, Hyd., T.S., Have Lost Original Registration Documents Property Bearing No. 1-52, (8082/2015) & Original Rectification Deed of Gachibowli, Serilingampally Mandal, & Municipality, R.R.Dist., While Making Xerox at Asifnagar Main Road on 14.08.2017. If Anybody Found Please Inform on 9866148592

Passport Missing: Name: Polisetti Kusuma Sirisha, Passport No: H5815690 If Anybody Found Contact: ✆ 9490167478

PROFESSIONAL SERVICES

ASTROLOGY

బాబా బషీర్‌ఖాన్ వ్యాపారంలో నష్టం, ప్రేమ, వివాహం, విద్య, విదేశీయానం, సంతానం, ఆర్థికసమస్యలు మొ॥ సమస్యలకై వెంటనే సం॥ 9989689194.

REAL ESTATE

FLAT FOR SALE

2BHK Flat 900 SFT 3BHK Flat 1200 SFT & 4 BHK Flats. Cupboards, 24 Hrs Water & etc. at Gaganmahal. Domalguda ✆ 8790521242/ 9705714877

HOUSE FOR SALE

Only 1-House left 2 BHK Semi Finished 7 Lakhs 120 Sq.Yds Ind House for Sale at Venkat Ramana Colony, Ibrahimpatnam. ✆ 9573454266.

Indp 2BHK 19,90,000/- Nr. Hayathnagar Gated Community With All Development Loan LRS R.Laxareddy ✆ 9290009902/ 9441091936/ 9000139851

Indp & Duplex House HMDA Layout 25 L to 50L, 5 Km From Adibatla IT Companies Nr. ORR Loans B.Bheem Reddy ✆ 8885060742/ 9700974808

Patanchervu, Isnapur 'x' Rd, 2BHK Independent House, Price 30Laks, gated commu, HMDA Appr. EMI Facility Bank Loans Ph: 7702402378/ 96422542567.

గండి మైసమ్మ దగ్గర గాగిల్లాపూర్‌లో గేటెడ్ కమ్యూనిటీ నందు ఇండ్లను ఆనుకొని అన్ని డెవలప్‌మెంట్స్‌తో 150 చ॥గ॥ల ప్లాట్స్ & 2BHK Indp 70% బ్యాంక్‌లోన్స్. ✆ 9494100200

LAND FOR SALE

ఉచితం. వినాయక చవితి సందర్భంగా AVM వెంచర్స్ వారి సువర్ణావకాశం. Hydలో న్యూ ఫార్మాసిటికీ దగ్గరలో 1-ఎకరం కేవలం 10 లక్షలు. ఇది తీసుకున్న వారికి 200 గ॥ ప్లాటు సైదరాబాద్ లిమిట్స్ లో ఉచితంగా ఇవ్వబడును. Ph: 9493166709/ 8897495566

PLOT FOR SALE

APPA Junction @ Chevella New Venture for Low Cost Fruit Plantation, Malabar Trees, Model Farm House, Farm Plots Ph: 9849096826

Adibatla ITIR Zone HMDA Approved Plots close to TCS, CTS, ORR Junction. Fully developed. Spot Regd. Loans ✆ 9618882020.

Bachupully, mallampet, ORR Junction (Exit-4) Road Facing Venture 150, 200 (Y) Plots with all Developments ✆ 9030033207, 9959991155.

Moula -Ali Industrial Plot for Sale 1023 Sq.Yards North West Corner Plot Contact: 9849619544

Fabcity - 690Sq.yds HMDA Plot Facing 80ft Road For sale @ Fabcity. Bank Loan Avail. Call: 9849052527, 7680889982.

HMDA Layout Open Plots 3yrs Instalment Booking Rs. 55K for 150 Sqy. Maheswara Medical College Isnapur, ORR Muthangi ✆ 7032444695

షాద్‌నగర్ టౌన్‌లో 100 గజాలు 1,50,000/- EMI (నెలకు 5 వేలు మాత్రమే) ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ. సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్‌బ్లిస్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్, P.S. అమీర్‌పేట్ ✆ 8185936389, 040-40246023.

Adibatla HMDA ప్లాట్లు సాగర్ హైవే TCS, వండర్‌లా పార్కు BDL దగ్గరలో All Dev. రెడీ టు కన్‌స్ట్రక్షన్, స్పాట్ రిజి॥ లోన్స్ సౌకర్యం. ✆ 9866227875.

శ్రీశైలంహైవే, కడ్తాల్ ఫార్మాసిటీ, RRR కి అతి సమీపంలో నెలసరి Rs: 6 వేల సులభ వాయిదాలతో 18 మలబార్ నీమ్ మొక్కలతో కూడిన ప్లాట్స్ కలవు. Ph: 8186867777

షాద్‌నగర్ మీదుగా నిర్మించబడుతున్న రీజనల్ రింగురోడ్డుకు దగ్గరగా 10సం॥ల ఉచిత సంరక్షణ, సకల సౌకర్యాలతో ప్రభుత్వ అనుమతులున్న 4 లక్షల విలువైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు కలవు. ✆ 9063896536

రాజేంద్రనగర్‌కు శంషాబాద్‌కు దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్సుల సౌకర్యంతో 100 గ॥, 1,50,000/- మాత్రమే. EMI, ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ, సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్ బ్లిస్ అపార్ట్‌మెంట్. శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్ P.S, అమీర్‌పేట్ ✆ 9849973149, 040-23739969.

యాదగిరిగుట్ట నుండి 3Km దూరంలో పెద్ద కందుకూరులో తక్కువ ధరలో ప్లాట్లు అమ్మబడును. మంచి వాస్తు & ప్లాట్లు సైజులు కలవు. బ్యాంకులోను కలదు. 040-24126888/9121797919

శంషాబాద్ & అప్పాజంక్షన్ దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్ సౌ॥ 100 చ॥గ॥ 9000తో మీ సొంతం, మిగిలినది EMIలో కట్టండి. ఫ్రీ సైట్ విజిట్, డైరెక్ట్ కంపెనీ RS ఎస్టేట్స్ ✆ 8790201417

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న యాదాద్రి టెంపుల్ దగ్గర అన్ని Dvpతో హైవేకు సమీపంలో రెసి॥ ఓపెన్ ప్లాట్లు కలవు, క్లియర్ టైటిల్ స్పాట్ రిజి॥ Ph: 9133100777.

150 గ॥ 15 వేలకే రిజి॥ & మిగతా 6500x16 నె॥ వాయిదాలు Nr.ఎయిర్ పోర్ట్ @ షాద్‌నగర్ Nr.సువర్ణభూమి ఇండ్లకు దగ్గరలో సంప్రదించండి. 9505289998.

కేవలం రూ: 1,25,000/- లకే 200 చ॥గ॥ల ఇంటి స్థలం హైదరాబాద్ (రామోజీ ఫిలింసిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లీ॥ టైటిల్ స్పాట్ రిజి॥ ✆ 9948078062, 9848305444.

Hyd నుండి అమరావతికి వెళ్లే రూట్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రం వద్ద చ॥గ॥ 3900/- మరియు 2800/- రూ॥లో డైలీ కాటేజ్‌లకు అనువైన ప్లాట్లు కలవు. ✆ 9963114817

యాదగిరిగుట్ట వరంగల్‌హైవే @ వంగపల్లి J.S.R గ్రూప్ సన్‌సిటీలో హైవే ఫేసింగ్‌కు DTCP 8 వెంచర్‌లలో ప్లాట్లు కలవు రిజి॥ + రిసార్ట్స్ మెంబర్‌షిప్ ఫ్రీ. సంప్ర: 9440697029

ఇల్లు కట్టుకోవడానికి 200 గ॥ 1.98 వేలకే వికారాబాద్, షాద్‌నగర్, సంగారెడ్డి ఏరియాలలో. 9 వేలకే. బుకింగ్ & మిగతా లోన్ & EMI, 9000 x 21 నె॥ 9346887779

ఇల్లు కట్టుకోవడానికి 100 గ॥ 95 వేలకే, 5 వేలకే బుకింగ్, & మిగతా లోన్, 9000x10 నె॥, Nr. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్, నియర్ సువర్ణభూమి 9553877779

99000/- లకే 100 చ॥గ॥ల ఇంటి స్థలం శంషాబాద్‌కు అతి దగ్గరలో రంగారెడ్డి జిల్లానందు డైరెక్ట్ కంపెనీ ఆఫర్. స్పాట్ రిజి॥ సైట్ విజిట్ ఫ్రీ, సంప్ర: 9949695027.

అతివేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీశైలం హైవేలో ఫార్మాసిటీ & రిజనల్ రింగ్‌రోడ్‌కి దగ్గరలో 100 ఎకరాలలో అన్ని డె॥ మెంట్స్‌తో (ఆఫర్ Price) గ॥ కేవలం రూ॥ 399/- లకే ఫార్మ్ ప్లాట్స్ కలవు. ✆ 9030060505

తెల్లాపూర్ ఓపెన్ ప్లాట్స్ 500 Sqyds E/F క్లియర్ టైటిల్ స్పాట్ రిజిస్ట్రేషన్ Ph: 8801680797

యాదగిరిగుట్ట సమీపంలో 92 ఎ॥ DTCP లేఅవుట్ నందు ఓపెన్ ప్లాట్లు కలవు. గేటెడ్ కమ్యూనిటీ, అన్ని Devp.తో స్పాట్ రిజి॥, EMI సౌకర్యం కలదు. 9885892222/ 7702779248

శ్రీశైలం హైవే కందుకూరు ముచర్ల ఫార్మాసిటి దగ్గర BT రోడ్‌కి ఆనుకొని ఇండ్ల ప్రక్కన. పండ్ల మొక్కలు, మల్‌బార్ మొక్కలతో ఫార్మ్ ప్లాట్స్. ఇల్లు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్ కలవు. EMI Avbl. ✆ 7799864445.

శంషాబాద్, శ్రీశ్రీశ్రీ చినజీయరుస్వామి ఆశ్రమానికి ఆనుకొని, ప్రపంచంలో అతి ఎత్తైన శ్రీరామానుజాచార్యుల 216 అడుగుల విగ్రహానికి అతి చేరువలో అత్యాధునిక సౌకర్యాలతో HMDA LP నంబరు కల్గిన మా Gated Townshipలో రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్న HMDA Plots కేవలం Rs. 4500/- per SqYd. అమ్మకానికి కలవు. (Brokers Excuse) Cont. Ph: 9505095050, 9603754444.

శ్రీగంధం ఫామ్ ల్యాండ్‌పై పెట్టుబడి 12 సం॥లలో 12 రెట్లు రాబడి. చ॥గ॥ రూ. 990/-, తూ.గో. జిల్లా, జగ్గంపేట NH-16 దగ్గరలో. సంప్ర: 84658 52937.

వంగపల్లి: వరంగల్ హైవేకి 1KMలో 100Ft రోడ్ ఫేసింగ్ DTCP అప్రూవ్డ్, గేటెడ్ కమ్యూనిటిలో ప్లాట్లు కలవు, ప్రతి బుకింగ్‌పై 5 గ్రా॥ గోల్డ్-ఫ్రీ. Ph: 9951662211.

వరంగల్ హైవే బీబీనగర్, భువనగిరి దగ్గరలో చ॥గ॥ Rs: 1849/-, 150, 300 చ॥గ॥ ప్లాట్స్‌లో శ్రీ గంధం మొక్కలతో చుట్టూ 7 అ॥ గోడతో కూడిన ఫామ్‌ప్లాట్స్ కలవు. Ph: 9133332051.

వెంచర్ క్లోజింగ్ ఆఫర్ శంషాబాద్ to షాబాద్ రోడ్‌లో గజం 999/- మాత్రమే ఫ్రీ సైట్ విజిట్. M.S ఎస్టేట్ ✆ 9949190981.

కేవలం గజం రూ. 459/- ఫామ్‌లాండ్ మలబార్, ఎర్రచందనం మొక్కలపై అధిక ఆదాయం. షాద్‌నగర్, గొల్లపల్లి దగ్గర. Contact: 8919958631.

COMMERCIAL SPACE FOR SALE

G+7 Floors Commercial & Office Space. For Sale/ Lease 1200 to 10,000 Sft @ Secunderabad. Ready to Occupy. 8801033634 Vasavi Group.

WANTED

రాంపల్లి సత్యానారాయణకాలని, యమనంపేట్, ఘట్కేసర్ పరిసరప్రాంతంలో పెద్దకంపౌండ్ గోడతో ప్రశాంతమైన స్థలం, ఇల్లు కారాయికి కావలెను. అందులో కుక్కలను, కోళ్ళను పెంచుకోవడానికి కావలెను. ✆ 9553643587.

JOBS

Part/Full Time Home Based On/Offline, DataEntry, Ad-Posting, Copy-Paste, SMS Send, Form Filling, Page Type Convert to Words, No Target, Earn:25-40K. 6Y.Old Govt.Reg. Co. AN ISO:9001-2015 Certified Co, Daily/Weekly Pay. Free Trng.& 9502750123/ 7095750123/ 040-42000192/ 94.

Wanted Business Developers for A Reputed Real Estate Company Gachibowli. Age: 18 to 25 Yrs, Sal- 10K+ Incentives. ✆ 9640158422

Wanted experienced D.Pharmacy, Pharma Asistants for Fast Growing retail Pharmacy Chain at Manikonda area. Accommodation Free 8886726777, 7382314566.

Required (DRA) Collection Field Executive. Durga Associates, Mirzalguda, Malkajgiri 8143708066/ 9966000012

Wanted Dynamic Sales Executives for Leading Automotive Lubricants Brand in Hyd (Office at Autonagar) Criteria- Min 2 Yrs Exp in FMCG or Lubricants Distribution, Graduate Owns 2 Wheeler 9177778622 (Time- 2PM-5PM) Write to mails@gkd.in

Imm Requirement for Telecalling Executives at RTC 'X' Rds, Lang: Kannada/ Telugu. This in not a consultancy. Cnt: Sandeep @ 9160904020

Wanted Courier Boys for BLUE DART Courier Bike must. Medchal, Kompally, Shameerpet, Bahadurpally and Sec-bad Areas. Sal: 12,000/- Plus Conveyance, E.S.I. and PF, Ph: 9395394641/ 8096880323/ 9704679593

Wanted Branch Managers/ Regional Managers with Stock Broking Experience F.No. 501, 5th Floor, Sonu's Manor, P.No.7, Prendarghast Rd, Sec'bad-03 Ph. 99482 99679 & 98486 34357 hr@steelcitynettrade.com

Wanted Employes for News channel (1)Editors/ Sub-Editors (Eng/Tel), Dtp operators (Eng/Tel) Graphic Designers & Video Editors Exp Candidates Preferred Sal; 12k-25k news Developers Qual; B.Tech/ MBA/MCA/Any degree (Freshers can also Apply) ✆ 8106573076 @Hyderabad

Wanted Experienced South Indian Chef for a Famous Restaurant ✆ 9000701652

Wanted Freshers. Earn 10000/- with Free Hostel. Qu: Inter/Degree age: 18-26. Cont: 7730005680, 9133979793

Wanted Female Telecallers and Marketing executives Male Graduates only. Salary + Incentives @ Ameerpet. Ph: 9676427869.

Wanted Lady Computer Operator (F/T) Sal: 10,000/- (P/T) Computer Operator (Gents) to Advocates Off @ Ashok Nagar, RTC 'X' Roads. ✆ 040-27661774/ 9848018122.

Walk-in- Interview Req Immd. Managers, Officers, Telecallers M/F No Qly. No Age Limit Fix Sal. MFA+Incentives. ✆ 9110773999/ 8686265669

Wanted Field Executives for a Reputed Company @ Nagole Fixed Salary + Commission. Contact: 9985509327

Required DTP Operators/ Proof Readers for a publishing company to work at office or from home at Vidyanagar. Hyd. ✆ 8121435483.

ప్రముఖ రియల్‌ఎస్టేట్ కం॥లో పనిచేయుటకు (M/F) ఎగ్జిక్యూటివ్స్, MM, AGM లు కావలెను. Fixed సాలరీ, మొబైల్ బిల్, పెట్రోల్, ఇన్సెంటివ్స్ కలవు. Ph: 7396923573.

Age: 64 (Vi) రాంపల్లి, నాగారం, జిల్లా: మేడ్చల్, హైదరాబాద్ వృద్ధునికి వంటచేసిపెట్టడానికి అతని ఆలనాపాలనా చూసుకోవడానికి ఒక నమ్మకమైన స్త్రీ కావలెను. ✆ 95536 43587.

సేల్స్‌బాయ్స్ & గర్ల్స్, కంప్యూటర్ ఆపరేటర్, క్యాషియర్స్, హెల్పర్స్ అనుభవం వున్నా/లేకున్నా వ॥45లోపు. జీతం 20,000/- రూప్‌లక్ష్మి PVT.మార్కెట్, కొత్తపేట్. ✆ 9248019916/9885673980.

చదువున్నా/ లేకున్నా ఉచిత నర్సింగ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ చూపించబడును. నర్సింగ్‌కేర్, పేషంట్‌కేర్ కొరకు (స్త్రీ/పు) కావలెను. జీ॥ 8000- 16,000/- వరకు ఉచిత వ॥+భో. 9966310431, 9010137634.

అర్జెంటుగా డైరెక్టు (తెలుగు) మాట్లాడే కా॥సెం॥కై M/F స్టాఫ్, DSNR, ఉప్పల్, సి॥బాద్, అ॥పేట్, ECIL, KPHB, MP, B.హిల్స్, హైటెక్‌సిటీ, P/F, D/N జీ: 14-25K Q: 10th - PG ✆ 7032473870

స్పాట్ జాయినింగ్. Sal: 18,000/- ప్రముఖ బ్యాంక్ ఏజెన్సీలకు ఖాళీ పోస్టులకు M/F స్టాఫ్ (తెలుగు) P/F టైం. ఆల్ ఏరియాస్ Age: 18-35, Q: 10th - PG ✆ 7993615994

గృహిణులకు గొప్ప అవకాశం ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు రి॥ LIC ఏజెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు కావలెను. సంప్ర॥ 9 to 6Pm 040-24126888.

రిసెప్షనిస్ట్, టెలికాలర్స్ కావలెను. Q: ఇంటర్/ డిగ్రీ, కొత్తపేట్. ✆ 8367677007, 8367677009.

హైదరాబాద్‌లో బైక్ గల డెలివరీ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. నెలకు జీతం రూ: 14,000+ రూ. 4000/- వరకు ప్రోత్సాహకాలు. సంప్ర: 9059375935, 9676494466

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

5 & 3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/ గర్ల్స్ కావలెను. గర్ల్స్ 600 - 1200/- బాయ్స్ 450-900/- P/F టైం రూం + మీల్స్ స్పాట్ పేమెంట్స్ ✆ 7995280048, 9666847563.

EENADU CLASSIFIEDS

JOBS

డైరెక్ట్ కంపెనీ సౌత్ ఇండియాలో అతిపెద్ద సంస్థకు M/F (పార్ట్/ ఫుల్‌టైం) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను & Govt/ Pvt ఎంప్లాయిస్/ గృహిణులు కూడా సంప్ర॥ Age: 25Y పైన, 9951381717/ 9573721956.

ప్రముఖ కార్పొరేట్ రియల్ ఎస్టేట్ కంపెనీకి M/F మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్స్, టీంలీడర్స్ కావలెను. ఫిక్స్‌డ్ జీతం: 10-15 వేలు+ కమీషన్ సంప్ర॥ ✆ 9963384139

5&3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/ గర్ల్స్ కావలెను. బాయ్స్: P/T: 450/- , F/T: 900/-, గర్ల్స్ P/F: 600/-, F/T: 1200/- రూం+మీల్స్ ఫ్రీ. స్పాట్ పేమెంట్స్ ✆ 8142208925/ 7799412556

ప్రముఖ కంపెనీ సికిందరాబాద్ నందు పనిచేయుటకు టెలికాలర్స్ Females కావలెను. సాలరీ + Incentives. Ph: 7799524946.

ఉద్యోగ అవకాశం: మేనేజర్స్ -10, టెలికాలర్స్ -10, ఆఫీస్‌బాయ్స్-2, కావలెను. Q: 10th ఆపైన Age: 18-30 Yrs, M.S. ఎస్టేట్, మియాపూర్. Ph: 9030095027.

ప్రముఖ బ్యాంక్ DSA లకై తెలుగు, కాల్‌సెంటర్‌లకై 10th, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, MBA, B.Tech, MCA, MSC P/F కై M/F స్టాఫ్ కావలెను. 9K-27K 9866241009/ 42615239

ఫోటోషాప్ ఆపరేటర్లు & ఆఫీసు సిబ్బంది స్త్రీలు/ పురుషులు కావలెను. సంప్ర: 9581414499/ లేదా 9866513888

GM's, AGM's కావలెను. నీతి నిజాయితీలతో సరికొత్త స్పాట్ కమీషన్ విధానంతో కష్టమర్లే దేవుళ్లుగా, మార్కెటింగ్ మిత్రులకు కామధేనువుగా హైదరాబాద్‌లో HMDA, L.P. కలిగి, ప్రముఖ ప్రదేశాలలో భారీ వెంచర్లు వున్న 30 సం॥ల రియల్‌ఎస్టేట్ అగ్రగామికి స్త్రీ, పురుషులు మార్కెటింగ్‌కి కావలెను. సంప్ర: ✆ 80198 99999, 95053 33397.

బధిర పిల్లల హాస్టల్ కొరకు 10 మంది స్త్రీ/ పురుషులు, కుక్‌లు కావలెను. వయస్సు 30 సం॥లు ఆపైన కలిగి ఉండాలి. గుర్తింపు కార్డు కలిగి ఉండాలి. ఆకర్షణీయమైన జీతం మరియు వసతి కలదు. ఆశ్రయ్ ఆకృతి - కుందన్‌బాగ్, బేగంపేట్ ✆ 8106841115/ 9100779274

ప్రముఖ పెస్ట్‌కంట్రోల్ నందు పనిచేయుటకు బాయ్స్ కావలెను. మంచి జీతం + రూమ్ సౌకర్యం కలదు. ఫోన్: 9618382227/ 9676735280.

UBER BIKE TAXI: మీ 2-వీలర్‌ని ట్యాక్సీగా నడుపుతూ గంటకి 100/- సంపాదించండి. వెంటనే 040-39560690 పై కాల్ చేయండి.

అర్జెంటుగా ప్రముఖ DSA ఏజెన్సీకై M/F స్టాఫ్ కావలెను. జీతం 10 to 25, Q: 10th to PG. All areas F/P టైం, Ph: 9515675540, 9133553001.

చంపాపేట, నాదర్‌గుల్‌లో ఇంట్లో ఉండి పనిచేయుటకు భార్యభర్తలు & ఇద్దరు మహిళలు ఇంటి పనిచేయుటకు కావలెను. ✆ 9000220098/ 9505695955

కూకట్‌పల్లి, నిజాంపేట్ ఏరియాలోని ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన వార్డ్‌బాయ్స్ కావలెను. జీ: 9-10 వేలు, ✆ 9666111048

ECIL దమ్మాయిగూడలోని హాస్పిటల్‌నందు పనిచేయుటకు DMO's, రిసెప్షనిస్ట్‌లు, మార్కెటింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నిషియన్స్ కావలెను. ✆ 9885089995/ 9703269611

SRనగర్ ప్రముఖ స్వగృహఫుడ్స్ నందు పనిచేయుటకు బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ కావలెను. వయస్సు: 45 సం॥పైన సమయం: 9AM to 9PM. సంప్రదించండి: 040-23701832.

ప్రముఖ MNC (BPO) కాల్‌సెంటర్‌లో Voice ప్రాసెస్‌కై Tel/ Hin/ Eng/ Tamil/ Kannd/ Maly, M/F స్టాఫ్ కావ॥, Q: 10th/ ఇంట/ డిగ్రీ/ PG, జీ: 10-20 K ✆ 9177408382/ 9394166524.

జిలాని వర్క్స్ బోరబండలో పనిచేయుటకు లేడి రిసెప్షనిస్ట్ కావలెను. బోరబండ, మాదాపూర్ పరిసర ప్రాంతాలవారికి ప్రాధాన్యత. ✆ 9949936173

ఎలక్ట్రికల్ EEE ఇంజనీర్స్, సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్(F) 2yrs అనుభవం, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలవారికి ప్రాధాన్యత. ✆ 9182167856 / 9966620387

మూసాపేట్ "Y" జంక్షన్‌లో నూతనంగా ప్రారంభంకాబోతున్న జ్యూవెలరి షోరూమ్‌లో పనిచేయుటకు సేల్స్‌మెన్స్, సేల్స్‌ఉమెన్స్, CRM's కావలెను. సంప్ర: ✆ 9948243304

MARKETING / SALES

Urgent Vacancies for Bikers Ecom Express Pvt Ltd A Leading Ecommerce Logistics Solutions Company Hiring For Across Hyderabad Qualification: 12th Pass (10th Pass will be considered) Bike compulsory with Valid Driving Licence & Android Phone. Salaries and Benefit Best in the industry, PF, ESI, Fuel, Incentive & Mobile Expenses Provided. Hurry up Limited Position Left !!! Interested candidate may please walk-in opp Pillar No. 256, Rajendra Nagar Attapur, Hyd. 500052. Mobile No: 7416867435, 8897336566

Marketing Manager Kavalenu. Experience in Marketing avasaram. Good Salary. Hardworking Undavalenu. Ph: 9885479549, 040-40151699

FACULTY / TEACHERS

Wanted Faculty (P/F) for Spoken English, SAP, Android, B.Tech Tuitions, Receptionist, Office-Boy @ LB Nagar. Ph: 9848293727.

Wanted Teachers for Kindergarten Section Contact Richmonds High School, Srinagar Colony Contact: ✆ 9440496613

Wanted P.G/ Trained/ Experienced Teachers to Handle 6th to 10th Computers & Exp PET also wanted for Ist to 5th Class English and Science Subjects. Contact: Sri Sairam High School. V.V.Nagar, Borabanda. Ph: 9100921412/ 040-65354338

Wanted Faculty : Chemistry, Commerce. Contact: Gowthami Jr. College. Contact: 9912989924, 9666360223

DRIVERS

డ్రైవర్లు కావలెను: జీతం 16-17 వేలు+ బెనిఫిట్స్, ఓనర్ వద్ద లగ్జరీ కార్లు నడుపుటకు సిటీ, హైవేలో 3-4 సం॥ల అనుభవం, 35 సం॥లోపు వయస్సు, సోమాజీగూడ. ఫో: 9666872553

కేవలం 20 నెలల్లో Verito Cabను స్వంతం చేసుకోండి. ముందస్తు చెల్లింపు లేకుండానే, షరతులు వర్తిస్తాయి. 40520197/ 7675909909.

బేగంపేట్‌లో ATM క్యాష్ లోడింగ్ వెహికల్ నడుపుటకు బ్యాడ్జి నెంబర్ గల డ్రైవర్లు కావలెను. జీతం: 12,000+ OT సం.ప్ర॥ 9951102555/ 9951103555

లారీడ్రైవర్స్ కావలెను. అనుభవం కలిగిన లారీ డ్రైవర్స్ కావలెను. నిజాంపేట / హైదరాబాద్ ✆ 040-65227799 / 9985982788

ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు హెవీలైసెన్స్ కలిగిన డ్రైవర్లు కావలెను. నాగారం, దంమైగూడ, నారాపల్లి, మేడిపల్లి, అజీజ్‌నగర్ & కొండాపూర్ ✆ 9951530159/ 9492570976.

Ster Prime Hospital లో పనిచేయడానికి డ్రైవర్స్ మరియు హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్ కావలెను అమీర్‌పేట con; ✆ 9133354483

ACCOUNTING

Req. Accts, Asst. @ Old Bowenpally Grad/ PG with 3-5Yrs, Exp: In Accts & Familiar with Data Entry in Tally & Banking Operations candidates Must be willing To Do Outside works on A Day to Day Basis ✆ 9010107721/ 9948921829 walk-in Interview on: 28-08-2017

ENGINEERING

Wanted Operators / Teachnicians. Qualification: B.Sc, M.Sc, Diploma in Chemical Engineering exp: 2-3yrs in Distillation columns. Contact: 9989522118.

MEDICAL

Required Female Ophthalmology Doctor for Part Time in Sanjeevan Netralaya @ Ameerpet, Above R.S. Brothers. 9010038833

Wanted Front Office, Nursing Staff with Pediatric Experience 1-3Yrs. For a Reputed Hospital. Contact: 9100900280

హాస్పిటల్స్ హోమ్‌కేర్‌లో పనిచేయడానికి నర్సింగ్ స్టాఫ్ ANM, GNM, B.Sc, ఆయాలు, వార్డ్ బాయ్స్, వంటవారు కావలెను. రూం+భోజనం, సాలరీ 10-30K ✆ 9177952194

SECURITY GUARDS

బోయినపల్లి, బంజారాహిల్స్, మేడ్చల్‌లో సెక్యూరిటి గార్డ్స్ (జీ: 10వేలు) అనుభవం కల్గిన ఫీల్డ్ ఆఫీసర్స్ (జీ: 13వేలు) అర్జంటుగా కావలెను. Ph: 9666066055/ 9010906111/ 65555711

తిరుమలగిరి యందు సెక్యూరిటీ గార్డ్స్‌గా పనిచేయుటకు చదువుకున్న పురుషులు కావలెను. (అర్జెంటుగా) డైరెక్ట్ జాబ్ కన్సల్టెన్సి ఫీజులేదు. ✆ 9533486161/ 7306192118

Wanted హైటెక్‌సిటి, మాదాపూర్ ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటిగార్డ్స్ కావలెను. 8గంటలు డ్యూటి. ESI, PF కలదు. Ph: 9100089952 / 9100089955

TOURS & TRAVELS

దసరాకి ఒరిస్సా 5 రోజుల AC యాత్ర సెప్టెంబర్ 26న పూరి, కోణార్క్, భువనేశ్వర్, గిరిజాదేవి శక్తి పీఠం, అన్నవరం, తలుపులమ్మ లోవ, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, పిఠాపురం, ద్రాక్షారామం, ద్వారాకాతిరుమల. లక్ష్మీటూర్స్. ✆ 98662 46466.

కావేరిపుష్కరాలు, మొదటిరోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే గోవా & కర్ణాటక 20 క్షేత్రాల AC యాత్ర Sep 4న & తమిళనాడు శ్రీరంగంలో పుష్కర స్నానమాచరించే రామేశ్వరం 30 క్షేత్రాల AC యాత్ర Sep 15న. ✆ 98662 46466.

శ్రీవిఘ్నేశ్వరటూర్స్: తమిళనాడు 21/09, 15/10, కర్నాటక 17/8, 9/12, గుజరాత్ 9/9, చార్‌ధామ్ 5/10, వైష్ణోదేవి 25/10 ✆ 9059125230/ 9030123243

సాయిటూర్స్: కర్ణాటక: మైసూర్, శృంగేరి ధర్మస్థల Sep-20 రూ॥ 7200/- ★ రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం Aug-26, Sep-27, Oct-21 రూ॥ 6500/- ✆ 9848664831

మణిమహేష్ కైలాష్ యాత్ర 26-8/ కిన్నెర శ్రీకంఠ మహదేవ్ కైలాష్ యాత్ర 31-8/ సపంత్‌సరోవర్ స్వర్గ రోహణ యాత్ర 15-9/ పాతాళభువనేశ్వర్ 25-9/ పుష్కరాలు 12-9/ 9885089092

సహస్ర టూర్స్ కావేరి పుష్కర యాత్ర (ప్రతిరోజు) శ్రీరంగపట్నం (కర్నాటక) 5 క్షేత్రాలు 3రో॥ మనిషికి రూ॥ 8,500/- గంగాసాగర్ - కామాఖ్య 19/11-12 రో॥ ✆ 7993478851/2/3

కావేరీ పుష్కర యాత్ర శ్రీరంగపట్నంకు ఆర్గనైజర్స్‌కు 12 రో॥ అన్ని వసతులు కల మార్క్యాంప్ సేవలు కావలిసిన వారు 24/8/17 సా॥ రాగలరు. ✆ 7993478851/2/3

కావేరి పుష్కరాలు Sep-13-23, 2 రాత్రిలు, 3 పగలు, అన్ని వసతులతో 9,250/7,250/- ఒక్క మనిషికి, పుష్కర స్నానం శ్రీరంగపట్నం , కర్ణాటక Ph: 9494873377/ 9494723377

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పబ్లిక్ సర్వీస్‌కమిషన్ కార్యాలయాల ముట్టడి

బీసీ, నిరుద్యోగ సంఘాల నేతల అరెస్టు



ముట్టడి కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య తదితర నేతలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో 1.25 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 పరీక్షలలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. తెలంగాణ బీసీ యువజన సంఘం, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘాల జేఏసీ, ఆంధ్రప్రదేశ్ బీసీ యువజన సంఘాల సంయుక్తాధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విషయాన్ని ముందుగా గ్రహించిన పోలీసులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల సమీపంలో ఉన్న నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. భాజపా కార్యాలయం, గాంధీభవన్, ఎగ్జిబిషన్ మైదానం సమీప ప్రాంతంలో ఉన్న నిరసనకారులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బేగంబజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిరసనకారులు, పోలీసులకు తోపులాటలు చోటు చేసుకున్నాయి. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నిస్తే నిరంకుశంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిరుద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేశ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

'అకౌంట్స్' ఉద్యోగుల పోటాపోటీ నిరసనలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పదోన్నతులకు సంబంధించి నియమించిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్స్ కమిటీ (డీపీసీ) రద్దు చేయాలని అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్స్ (ఏపీఏఓ), డీపీసీని యథాతథంగా కొనసాగించాలని డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (డీఏఓ)లు విడిపోయి ఒకే చోట పోటాపోటీ నిరసన నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిరసనకారులు తమ ఆందోళనను విరమించకపోవడంతో పోలీసులు ఏపీఏఓలను అదుపులోకి తీసుకుని బేగంబజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనేక ఏళ్లుగా పదోన్నతులలో అన్యాయం జరుగుతోందని, డీపీసీని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని తెలంగాణ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అనుబంధం), పదోన్నతులలో పాత పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ డీఏఓల సంఘం (టీజీఓ కేంద్ర సంఘం అనుబంధం) వేర్వేరుగా నాంపల్లి డైరెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. తెలంగాణ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.రమణారావు విలేకరులతో మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ శాఖలలో మొదటి నుంచి మాతృశాఖలో పని చేస్తున్న సూపరింటెంటెంట్‌లకు 70 శాతం పదోన్నతులు ఇస్తుండగా పే అండ్ అకౌంట్స్‌లో మాత్రం కేవలం 20 శాతం మాత్రమే ఇస్తున్నారన్నారు. తెలంగాణ డీఏఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జియావుల్లా మాట్లాడుతూ 510 జీఓను అమలు చేయాలని, ప్రస్తుత 6:2:2 నిష్పత్తిని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం 30-40 ఏళ్లుగా ఉందన్నారు.

యువత సంక్షేమమే ప్రధాని లక్ష్యం

భాజపా జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు




విజేతలకు షీల్డులు బహుకరిస్తున్న మురళీధరరావు

కాటేదాన్, న్యూస్‌టుడే: దేశంలోని యువత సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యమని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధరరావు అన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బీజేవైం నిర్వహించిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో రాణించిన విజేతలకు ఆయన షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విధమైన లోటుపాట్లను యువకులు జీవితంలో ఎదుర్కొనకుండా ఉంటే దేశరక్షణకు, అభివృద్ధికి వారే నాంది పలుకుతారన్నారు. అన్ని రంగాల్లో యువత ముందుండాలని రాష్ట్ర భాజపా అధ్యక్షులు డా. కె.లక్ష్మణ్ అన్నారు. తొలుత పోటీలను ప్రారంభించి నల్గొండ, హైదరాబాద్, వనపర్తి, నిజామాబాద్‌లనుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు భరత్‌గౌడ్, బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్, రవికుమార్, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా సమాచారహక్కు చట్టం కన్వీనర్ నవారు మురళీధర్ రెడ్డి, మైలార్‌దేవుపల్లి డివిజన్ పార్టీ అధ్యక్షుడు అడికె జనార్ధన్, రవికుమార్, బల్ల శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రండి... ఆస్వాదించండి!

తమ రాష్ట్రాన్ని సందర్శించాలని మధ్యప్రదేశ్ అధికారుల విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఓంవిజయ్ చౌదరి

సోమాజిగూడ: మధ్యప్రదేశ్‌లోని పర్యాటక స్థలాలకు ప్రాచుర్యం కల్పించేందుకు ఆ రాష్ట్ర పర్యాటక మండలి రోడ్ షో పేరుతో అక్కడి ప్రాధాన్యం గల ప్రదేశాల విశేషాలను ప్రదర్శించారు. బుధవారం సోమాజిగూడలోని ద పార్కు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యాటక విశేషాలను ఆ రాష్ట్ర పర్యాటక మండలి అదనపు సంచాలకులు శ్రీకాంత్ పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఓంవిజయ్ చౌదరి వెల్లడించారు. మధ్యప్రదేశ్‌ను పర్యాటక స్నేహపూర్వక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు వివిధ ప్రణాళికల ద్వారా స్పష్టమైన విజన్‌ను కలిగి ఉన్నామన్నారు. పర్యాటక మండలి అక్టోబరులో నిర్వహించబోయే మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్, వచ్చే ఏడాది జనవరిలో ఇందిరా సాగర్ డ్యామ్ దగ్గర జరిగే జల్‌మహోత్సవ్ లాంటివి ఎంతో అలరించనున్నాయన్నారు. పర్యాటకులకు ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని వివరించారు.



వరదనీటి కాలువలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు వేయరాదని హయత్‌నగర్ కార్పొరేటర్ సామతిరుమల్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో మంగళవారం ఆయన పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వరదనీటి కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

– న్యూస్‌టుడే, హయత్‌నగర్


నీరుగారుతున్న.. వినియోగదారుడు

- కొత్త నల్లాదారుల నెత్తిన అదనపు భారం!
- పైపులు, క్లాంపులు స్టోర్స్‌కే పరిమితం
- వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు

ఈనాడు, హైదరాబాద్

నూతనంగా నల్లా కనెక్షను తీసుకునే వారు అదనపు బాదుడుతో బెంబేలెత్తుతున్నారు. నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు అవసరమైన సామగ్రి జలమండలి సరఫరా చేస్తున్న సరే కొందరు అధికారులు, గుత్తేదారుల తీరుతో అవి వినియోగదారులకు ఉపయోగ పడకుండా పోతున్నాయి. నల్లాదారులు తమ చేతి చమురు వదిలించుకుంటున్నారు.

దాదాపు రూ.1900 కోట్ల హడ్కో నిధులతో నగర శివార్లలోని 12 మున్సిపల్ సర్కిళ్లలో తాగునీటి విస్తరణ పనులు చేపడుతున్నారు. మొత్తం 56 రిజర్వాయర్లు 1800 కిలోమీటర్ల మేర కొత్త లైన్లు వేస్తున్నారు. ఇందులో ఇప్పటికే 12 రిజర్వాయర్లు అందుబాటులో వచ్చాయి. మిగతా వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వచ్చే ఏడాదికి నాటికి మొత్తం ప్రాజెక్టు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో దాదాపు లక్ష కొత్త నల్లాలు పంపిణీ చేయాలనేది జలమండలి లక్ష్యంగా పెట్టుకొంది. దారిద్ర్యరేఖ దిగువన ఉన్న కుటుంబాలకు ఒక్క రూపాయికే అందిస్తున్నారు. కొత్త నల్లా జారీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిర్లక్ష్యంలో వినియోగదారులు చేతి చమురు వదిలించుకుంటున్నారు. గృహావసరాలకు అర అంగుళం నల్లాలను జారీ చేస్తున్నారు. ఇందుకు ఇంటి వైశాల్యం, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం నిర్ణీత కనెక్షన్ ఛార్జీలు చెల్లించాలి. 15 రోజుల్లో కనెక్షన్ మంజూరు చేస్తారు. ఈ సమాచారం ఆయా ప్రాంత కాంట్రాక్టర్, సిబ్బందికి జలమండలి ద్వారా పంపించి కొత్త నల్లాను అందిస్తారు. కనెక్షన్ ఛార్జీలు తప్ప వినియోగదారులు అదనంగా పైసా చెల్లించాల్సిన అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు.



క్షేత్రస్థాయిలో జరుగుతున్నదిదీ..

కొత్త నల్లాల జారీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న వేరుగా ఉంది. ప్రధాన లైను నుంచి ఇంటికి కనెక్షన్ తీసే సందర్భంగా 100-200 మీటర్ల వరకు పైపులతో పాటు మీటర వద్ద బిగించేందుకు క్లాంపులు ఇతర చిన్నచిన్న పరికరాలు అవసరం ఉంది. వీటిని జలమండలి సరఫరా చేస్తోంది. కనెక్షన్ ఛార్జీల్లోనూ వీటి ఖర్చులు కలిపి ఉంటాయి. ఈ పైపులు, పరికరాలు కోసం అధికారులు ప్రతి మూడు నెలలకొకసారి టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. కొత్త కనెక్షన్ జారీ సమయంలో సంబంధిత గుత్తేదారు ద్వారా వీటిని సరఫరా చేయాలి. జలమండలి నిర్లక్ష్యం కారణంగా చాలామంది గుత్తేదారులకు ఈ సామగ్రి చేరడం లేదు. కొందరు గుత్తేదారులకు కేవలం పైపుల వరకు అందిస్తున్నారు. క్లాంపులు ఇతర పరికరాలు నల్లాదారులతో కొనిపిస్తున్నారు. ప్రస్తుతం గోషామహల్ ప్రధాన స్టోర్‌లో ఈ సామగ్రి గుట్టగుట్టలుగా పడి ఉన్నట్లు సమాచారం. రూ.లక్షలు పోసి కొని నిరుపయోగంగా తుప్పుపట్టి పాడైపోతున్నాయి. మరోవైపు నల్లాదారుల జేబును గుల్ల అవుతుంది. ఇలా రెండు రకాలుగా వినియోగదారులు నష్టపోతున్నారు. చాలామంది నల్లాదారులకు అవగాహన లేకపోవడం వల్ల కూడా జేబుకు చిల్లుపడుతోంది.

ఖర్చుల పేరిట వసూళ్లు...

కొత్త నల్లా మంజూరు అయిందంటే కొందరు గుత్తేదారులు, జలమండలి సిబ్బందికి పండగే. వినియోగదారుల పైపులు, క్లాంపుల కోసం రూ.2-3 వేలు, అదనపు ఖర్చుల పేరిట మరో వేయి వరకు వసూలు చేస్తున్నారు. కనెక్షన్ ఛార్జీల పేరిట జలమండలికి చెల్లించిన దానికంటే కొన్నిసార్లు ఈ అదనపు బాదుడే ఎక్కువగా ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో వాణిజ్య కేటగిరి కింద వచ్చే భవనాలను కూడా గృహావసరాల కేటగిరీలో చూపించి మాయ చేస్తున్నారు. గతంలో మల్కాజిగిరిలో కొత్త నల్లాల జారీ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో జలమండలి ఎండీ దానకిషోర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవసరి హెచ్చరించారు. అయినా తీరు మాత్రం మారలేదు. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా 9.65 లక్షల నల్లాలు ఉన్నాయి. శివార్లలో కొత్త నల్లాల జారీ బాగా ఊపందుకుంది. నెలకు 300-500 వరకు నల్లాలు పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన వినియోగదారులపైన భారీగానే అదనపు బాదుడు ఉంటోంది.



పురస్కార గ్రహీతలతో గవర్నర్ నరసింహన్

మేనేజ్‌మెంట్ రంగంలో వృత్తిపర విలువలు అవసరం

● హెచ్ఎంఏ పురస్కారాల ప్రదానోత్సవంలో గవర్నర్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: సంస్థ నిర్వహణ అనేది కళో.. విజ్ఞానశాస్త్రమో కాదూ... తమ ఉద్యోగుల మనసులు, మనోభావాలను అర్థం చేసుకుంటూ.. తమకు కావాల్సిన లక్ష్యాన్ని సాధించుకోవడమే నిజమైన మేనేజ్‌మెంట్ అని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ అన్నారు. హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) 44వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం రాత్రి నగరంలోని ఎఫ్‌ట్యాప్సీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి గవర్నర్ మాట్లాడుతూ సంస్థకు నిజాయితీ, సమగ్రత ముఖ్యమని, అదే క్రమంలో సాంకేతిక ప్రమాణాల్లో కూడా అత్యుత్తమస్థాయి ఉండాలన్నారు. తెలుగు ప్రజలు చెప్పే 'సర్దుకుపోండి' అనే మాటలోనే నిజమైన మేనేజ్‌మెంట్ నైపుణ్యం దాగి ఉందన్నారు. హెచ్ఎంఏ గౌరవ అధ్యక్షుడు కె.హరిశ్చంద్ర ప్రసాద్ అధ్యక్షోపన్యాసం చేశారు. అధ్యక్షులు శ్రవణ్ కుమార్ మండప్, కార్యదర్శి రవికుమార్ పీసపాటి సభాసమన్వయం చేశారు. నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు డా.వి.కె.సారస్వత్‌కు హెచ్ఎంఏ జీవన సాఫల్య పురస్కారం (2016)తో సత్కరించారు. మేనేజర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో డీఆర్‌డీఎల్ సహాయ సంచాలకురాలు జి.చంద్రమౌళిని, ఎంటర్‌పేన్యూర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో థెర్మో కేబుల్స్ ఎండీ ఉమా గుర్కా, స్మాల్ స్కేల్ ఎంటర్‌పేన్యూర్ ఆఫ్ ది ఇయర్ డెలక్టో ఎండీ టి.బాలకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో ఎన్‌సీసీ సంస్థ హెచ్ఆర్ విభాగం అధిపతి కె.వి.ఎస్.ఎస్.నారాయణరావు, సీఎస్ఆర్ అవార్డుతో ఫీనిక్స్ ఫౌండేషన్, మెంబర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో హెచ్ఎంఏ జీవితకాల సభ్యుడు ప్రొ.కె.వి.అచలపతికి అందజేసి సత్కరించారు.

బిగ్‌బజార్‌లో ఆడుకుంటూ గాయపడిన బాలుడు



గాయపడిన అభిరామ్

సుల్తాన్‌బజార్: కాచిగూడ బిగ్‌బజార్‌లోని ఎంటర్‌నైట్‌మెంట్ జోన్‌లో కారునడుపుతూ ప్రమాదవశాత్తూ ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ విషయమై సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని చిన్నారి తలిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఘటనకు చిన్నారి తలిదండ్రుల నిర్లక్ష్యమే అని పోలీసులు తేల్చారు. ఏఎస్ రావు నగర్ ప్రాంతానికి చెందిన సుధాకర్, సౌజన్య దంపతులు తమ ఇద్దరు పిల్లలతో మంగళవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని తమ తలిదండ్రుల ఇంటి నుంచి తిరిగివస్తూ షాపింగ్ కోసం కాచిగూడ చౌరస్తాలోని బిగ్‌బజార్‌కు వెళ్లారు. రెండో అంతస్థులో ప్లేజోన్‌లో మూడు సంవత్సరాల కుమారుడు అభిరామ్ కారు నడిపిస్తుండగా ప్రమాదవశాత్తూ కిందకి జారడంతో ముక్కుకి తీవ్ర గాయమైంది. బాధితులు బుధవారం బిగ్‌బజార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించారు. ఘటనలో తమ చిన్నారికి గాయమైనా సదరు యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుతం అభిరామ్ లక్డీకాపూల్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణప్రసాద్ సిబ్బందితో బిగ్‌బజార్‌కు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సీసీ పుటేజీ పరిశీలించగా చిన్నారి అభిరామ్‌ను కారులో ఎక్కించి మరో కుమారుడితో కలిసి వస్తువులు కొనుగోలు చేసేందుకు తల్లిదండ్రులు పక్కకు వెళ్లారని, అదే సమయంలో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై ప్రమాదానికి తలిదండ్రుల నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రావు పేర్కొన్నారు. కాగా ఈఘటనను రాష్ట్ర బాలల హక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిగ్‌బజార్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

అదనపు భారం మోయలేం

కలెక్టర్ కొత్త విధానంపై ఉపాధ్యాయుల విముఖత

ఈనాడు, హైదరాబాద్: ఓవైపు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉన్న 'త్రీ ఆర్' విధానం.. ఇవే కాకుండా హైదరాబాద్ జిల్లాలో కొత్తగా గ్రేడ్ల కేటాయింపునకు మరో పరీక్ష నిర్వహించాలనే కలెక్టర్ యోగితారాణా ఆదేశాలపై ఉపాధ్యాయుల్లో విముఖత వ్యక్తమవుతోంది. తాజా ఆదేశాలు తమతోపాటు విద్యార్థులపైనా అదనపు భారాన్ని మోపడమేననే అభిప్రాయాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. తెలుగు, ఆంగ్లంలో రాయడం, చదవడం, గణితంలో భాగహారం చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. ఈక్రమంలో తొమ్మిదో తరగతి వరకు విద్యార్థుల్ని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విభజించుకొని తర్ఫీదునిస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు తన సబ్జెక్టు కాకున్నా తన బృందంలోని విద్యార్థులను మిగిలిన సబ్జెక్టుల్లోనూ తీర్చిదిద్దుతున్నారు. ప్రతి పది రోజులకోమారు పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవలే జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యోగితారాణా మరో కొత్త విధానాన్ని తెర పైకి తీసుకొచ్చారు. తెలుగు, ఆంగ్లం, గణితంతోపాటు సైన్స్‌లోనూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సబ్జెక్టులవారీగా 20 మార్కులకు ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించి 11 గ్రేడ్లను కేటాయించాలని స్పష్టం చేశారు. ఇది అదనపు భారం అవుతుందని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఉన్నతాదికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



అలంకరణ అదుర్స్

నగరంలోని రాజ్‌భవన్ మార్గంలోని ఓ హోటల్లో బెలూన్లపై వివిధ రకాల చిత్రాలు గీసి అందంగా అలంకరించారు. అతిథులను ఆకట్టుకునేందుకు యాజమాన్యం చేసిన చిన్న ప్రయత్నమిది.

వేగవంతంగా రహదారుల మరమ్మతులు

● ఇప్పటికి 91 పనులు పూర్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. 587 ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడంతో వీటి పునరుద్ధరణకు రూ.22.74 కోట్లు వ్యయం చేస్తున్నట్లు బల్దియా వెల్లడించింది. గుంతలు పడిన రహదారులను బాగుచేయడం, ధ్వంసమైన రహదారుల్లో నూతన నిర్మాణాల మరమ్మతుల పనులను కొనసాగిస్తున్నట్లు వివరించింది. ఇందులోని 200 ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో త్వరితగతంగా టెండర్లను పిలిచి 91 ప్రాంతాల్లో మరమ్మతు పనులను పూర్తి చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం 145 పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, 45 ప్రాంతాల్లో నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించింది. దక్షిణ మండలంలో 35 మరమ్మతుల పనులు, మధ్య మండలంలో 16 పనులు, పశ్చిమ మండలంలో 12 పనులు, ఉత్తర మండలంలో 20 పనులు, తూర్పు మండలంలో 8చోట్ల రహదారుల మరమ్మతులను చేపట్టినట్లు వివరించింది. రహదారులపై ఏర్పడిన 26,101 గుంతలను పూడ్చివేశారు. ఇంకా 46చోట్ల గుంతలను పూడ్చాల్సి ఉందని వివరించింది. గుంతలు ఏర్పడితే తక్షణమే పనులు చేపడుతున్నట్లు పేర్కొంది.

ఖైరతాబాద్‌లో... రేపటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఖైరతాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. మహా గణపతిని సందర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకోనున్న తరుణంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 4 వరకు ట్రాఫిక్ మళ్లింపునకు ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ తెలిపారు. ఖైరతాబాద్ వినాయకుడి దగ్గర బందోబస్తులో భాగంగా సూచించిన తేదీల్లో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆంక్షలు అమలులో ఉంటాయి.

● మింట్ కాంపౌండ్, నెక్లెస్ రోటరీ (ఇందిరాగాంధీ విగ్రహం కూడలి) నుంచి ఖైరతాబాద్ వినాయక విగ్రహం (గ్రంథాలయం) వైపునకు అనుమతించరు. ఆ వాహనాలు ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం వైపు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ● ప్రధాన రహదారిలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రైల్వే గేటు మీదుగా వినాయకుడి వైపునకు వాహనాలు అనుమతించరు. వాటిని నిరంకారీ కూడలి వైపు మళ్లిస్తారు. ● లక్డీకాపూల్‌లోని రాజ్‌దూత్ హోటల్ నుంచి గ్రంథాలయం వైపునకు వచ్చే వాహనాలను స్థానిక వార్డు కార్యాలయం దగ్గర మార్కెట్ వైపు వెళ్లాలి.

గణపతి చెంతకొచ్చే వారికి పార్కింగ్.. శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం నుంచి రద్దీ వేళల్లో ఖైరతాబాద్ గణపతి చెంతకు వచ్చే భక్తుల వాహనాలు బయటే నిలపాల్సి ఉంటుంది. ఖైరతాబాద్ రైల్వే గేటు సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి షాదన్ కళాశాల మార్గంలో ఎడమవైపు ద్విచక్ర వాహనాల పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్, నెక్లెస్ రోడ్డు, సచివాలయం మార్గాల్లో వచ్చే వారు మింట్ కాంపౌండ్ ప్రాంతంలో పార్కింగ్‌కు అనుమతి ఉంది. మింట్ కాంపౌండ్‌లోని కర్బుజ పళ్ల సెంటర్ నుంచి వినాయకుడి వైపునకు రోడ్డు ఎడమ వైపున ద్విచక్ర వాహనాలు, మింట్‌కాంపౌండ్‌లో కార్ల పార్కింగ్‌కు అవకాశం ఉంది.

'డిపోర్టు' ముద్ర పడితే.. తిరిగి రాలేరు!

- తాజాగా థాయ్ యువతుల వీసాలపై ప్రయోగం
- విదేశీయుల ప్రాంతీయ నమోదు కేంద్రానికి లేఖలు

ఈనాడు, హైదరాబాద్

స్పాలలో మసాజ్ పేరిట వ్యభిచారానికి పాల్పడిన థాయ్ యువతులను 'డిపోర్టు' చేస్తున్నారు.. వీసా గడువు ముగిసినా హైదరాబాద్‌లోనే మకాం ఉంటున్న నైజీరియన్లను 'డిపోర్టు' చేశారు.. దుబాయ్‌లో ఉంటూ యువతలో ఉగ్రభావజాలం నూరిపోస్తున్నందుకు హైదరాబాదీ నిక్కీ జోసెఫ్‌ను అక్కడి ప్రభుత్వం భారత్‌కు 'డిపోర్టు' చేసింది. అసలు ఏమిటీ డిపోర్టు. ఇటీవల పలు సందర్భాల్లో పోలీసులు ప్రయోగిస్తున్న ఈ అస్త్రానికి ఎంతవరకు పదునుంటుంది..? అనేది చర్చనీయాంశంగా మారింది. 'డిపోర్టు' చేయడం అంటే 'బహిష్కరించడం' అని అర్థం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే విదేశీయుల్ని తిరిగి వారి స్వదేశాలకు పంపేందుకు పోలీసులు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తుంటారు. ఒకరకంగా చెప్పాలంటే అలాంటి విదేశీయులు తమ దేశంలో ఉంటే భవిష్యత్తులో సమస్యగా మారతారని భావించిన పక్షంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకుంటారు. ఒక దేశంలో పోలీసులు ఈ అస్త్రాన్ని ఒక్కసారి ప్రయోగిస్తే విదేశీయులు తిరిగి ఆ దేశానికి వెళ్లడం దాదాపు అసాధ్యం. తాజాగా ఐటీ కారిడార్‌లోని స్పాలలో వ్యభిచారానికి పాల్పడుతూ చిక్కిన థాయ్ సెక్స్‌వర్కర్లపై సైబరాబాద్ పోలీసులు ఇదే అస్త్రాన్ని ప్రయోగించారు. స్పాలలో దాడులు నిర్వహించిన రోజే ఎఫ్ఆర్ఆర్‌వోకు సమాచారం అందించి, ఆ అధికారుల బృందం సమక్షంలోనే స్పాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈనేపథ్యంలో బహిష్కరణ (డిపోర్టేషన్) ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది.



ఎఫ్ఆర్ఆర్‌వో అనుమతితో..

డిపోర్టేషన్ అస్త్రాన్ని ప్రయోగించాలంటే సుదీర్ఘ ప్రక్రియనే ఉంటుంది. సాధారణంగా వీసా గడువు ముగిసినా అక్రమంగా ఉంటున్న విదేశీయులు, తీవ్రమైన నేరాలకు కాకుండా వ్యభిచారం లాంటి కేసుల్లో బాధితురాళ్లుగా చిక్కిన విదేశీ మహిళలు.. తదితరులపై దీన్ని ప్రయోగిస్తారు. ఇలా చేసేందుకు కేవలం పోలీసులు మాత్రమే నిర్ణయం తీసుకుంటే సరిపోదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ చిక్కిన విదేశీయుల గురించి పోలీసులు ముందుగా విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం(ఎఫ్ఆర్ఆర్‌వో) అధికారికి లేఖ రాస్తారు. ఎక్కడైనా సరే విదేశీయులు ఓ ప్రాంతానికి వస్తే అక్కడి ఎఫ్ఆర్ఆర్‌వోలో ముందుగా పేరు నమోదు చేసుకుంటారు. తాము అక్కడ ఉన్నంత కాలం ఏ చిరునామాలో ఉంటున్నామో తెలియజేస్తారు. ఒకవేళ చిరునామా మారినా.. మరోసారి కార్యలయానికి సమాచారం అందిస్తారు. ఈనేపథ్యంలో విదేశీయుల మకాం గురించి పర్యవేక్షణలో ఎఫ్ఆర్ఆర్‌వోది కీలకపాత్ర కాబట్టి పోలీసులు ఆ కార్యాలయానికి లేఖ రాస్తారు. ఈక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ అనుమతితో ఎఫ్ఆర్ఆర్‌వో డిపోర్టేషన్ ప్రక్రియను చేపడతారు. పాస్‌పోర్టు, వీసా గడువు ఉండి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో గనక చిక్కితే.. వారితోనే విమాన టికెట్ కొనుగోలు చేయించి వారి స్వదేశానికి పంపిస్తారు. ఒకవేళ వారి వద్ద విమాన టికెట్ కొనేందుకు డబ్బులు లేకుంటే ఎఫ్ఆర్ఆర్‌వోనే భరిస్తుంది. మరోవైపు ఇలాంటి వారి వ్యవహారాల్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉంటుంది. చాలా సందర్భాల్లో ఎఫ్ఆర్ఆర్‌వోనే ఈ ప్రక్రియను పూర్తి చేస్తుంది. ఈక్రమంలో పాస్‌పోర్టు, వీసాల గడువు ముగిసిపోయినట్లు గుర్తిస్తే 'ఎగ్జిట్ పర్మిట్' తయారు చేయాల్సి ఉంటుంది. ఇది తాత్కాలిక పాస్‌పోర్టు లాంటిదన్న మాట. ఒక దేశం నుంచి మరో దేశం వెళ్లేందుకు పాస్‌పోర్టు తప్పనిసరి కావడంతో 'డిపోర్టేషన్ ఆర్డర్' పేరిట తాత్కాలికంగా దీన్ని రూపొందిస్తారు. వీసా నిబంధనల్ని ఉల్లంఘించిన కారణాలను ఊటంకిస్తూ ఈ నిర్ణయం తీసుకుంటారు. పాస్‌పోర్టులోనే ఒక పేజీలో 'డిపోర్టు' అని ముద్ర వేస్తారు. ఆ ముద్ర ఉంటే భవిష్యత్తులో మరోసారి ఆ దేశానికి రావడానికి వీలుండదు. వీరి పేరును విదేశీ వ్యవహారాల శాఖలో నిషేధపు జాబితాలో పెడతారు. ఒకవేళ తప్పనిసరిగా రావాల్సి ఉంటే విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదంత సులువు కాబోదు. మరోవైపు ఎవరైనా విదేశీయులు పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భంలో మాత్రం టెంపరరీ ట్రావెల్ డాక్యుమెంట్(తాత్కాలిక రవాణా పత్రం)ను రూపొందిస్తారు. దాని ఆధారంగానే తిరిగి వారి స్వదేశాలకు పంపిస్తారు.

కేసులో చిక్కితే..

విదేశీయులు ఒకవేళ ఏదైనా కేసులో ఇరుక్కుంటే మాత్రం అప్పటికప్పుడు బహిష్కరించడం (డిపోర్టు) కుదరదు. చట్టాన్ని అనుసరించి పోలీసులు ఆ నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జైలుకు తరలించారు. ఆ సందర్భంలో కేసు వివరాల్ని ఉటంకిస్తూ విమానాశ్రయాలకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేస్తారు. ఒకవేళ విదేశీ నిందితులు బెయిల్‌పై వచ్చినా.. కేసు న్యాయస్థానంలో నడుస్తున్న కారణంగా విదేశాలకు వెళ్లడం కుదరదు. అలా కేసులో అభియోగాలు రుజువై శిక్ష పడితే.. శిక్ష పూర్తయిన తర్వాత అప్పుడు డిపోర్టు చేస్తారు. పై అన్ని సందర్భాల్లో ఎఫ్ఆర్ఆర్‌వో దిల్లీలోని ఆయా దేశాల దౌత్యకార్యాలయాలకు సమాచారం అందిస్తారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ చిక్కిన విదేశీయుల్ని నిబంధనల మేరకు డిటెన్షన్ కేంద్రంలో ఉంచాలి. డిపోర్టేషన్ ఆదేశాల జారీ అయిన తర్వాత ఆ కేంద్రం నుంచే వారి స్వదేశానికి పంపిస్తారు. కానీ హైదరాబాద్‌లో డిటెన్షన్ కేంద్రం లేదు. విదేశీ మహిళలనైతే రెస్క్యూ హోంల్లోనే ఉంచుతున్నారు. తాజాగా చిక్కిన థాయ్ యువతులను కేపీహెచ్‌బీ అల్విన్‌కాలనీలోని ఓ రెస్క్యూ హోంలోనే ఉంచారు. ఎఫ్ఆర్ఆర్‌వో నుంచి అనుమతులు వచ్చిన తర్వాత వారిని థాయ్‌లాండ్‌కు పంపించే యోచనలో ఉన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు రాంరెడ్డి, నేతలు

రైతులకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలం

- భాజపా కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు రాంరెడ్డి

బాలాపూర్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువశాతం మంది రైతులు కూరగాయలను పండిస్తారని.. వారికి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు ఎ.రాంరెడ్డి ఆరోపించారు. తుక్కుగూడలో ఈనెల 28న కూరగాయల రైతుల సమస్యలపై జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే 'రైతు పంచాయతీ' కార్యక్రమ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. బడంగ్‌పేట కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఎన్.లింగంయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ సకాలంలో నాణ్యమైన విత్తనాల సరఫరా, పనిముట్లపై సబ్సిడీ, కూరగాయల మార్కెట్లో సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు పంచాయతీ కార్యక్రమానికి భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు హాజరవుతున్నారన్నారు. రైతులు, భాజపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భాగ్యనగర్ రైతు సహకార సంఘం ఛైర్మన్ పి.పుల్లారెడ్డి, వైస్ ఛైర్మన్ ఎ.వెంకట్‌రెడ్డి, నాయకులు టి.మల్లారెడ్డి, టి.భాస్కర్‌రెడ్డి, ఎన్.శ్రీకాంత్‌గౌడ్, పి.లక్ష్మణ్, జె.రమేష్‌యాదవ్, ఎ.రాంరెడ్డి, జె.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిలోఫర్‌లో పొరుగుసేవల ఉద్యోగుల ధర్నా



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులు

రెడ్‌హిల్స్: గత రెండు నెలల వేతనాల బకాయిలు చెల్లించాలంటూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (టీఎంసీఈడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో నిలోఫర్ ఆసుపత్రిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల, శానిటేషన్, వార్డ్ బాయ్స్, డ్రైవర్లు విధులను బహిష్కరించి బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో ధర్నా చేశారు. నినాదాలతో హోరెత్తించారు. సంఘం నగర అధ్యక్షుడు ఎం.నర్సింహా మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని సంబంధిత మంత్రి లక్ష్మారెడ్డి చెబుతున్నా ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల దగ్గర ఆ విశ్వాసాన్ని కోల్పోతోందన్నారు. నిలోఫర్ ఆసుపత్రిలో పొరుగు సేవల్లో సిస్టర్లు, టెక్నీషియన్లు, వార్డు బాయ్‌లు, డ్రైవర్లు కలిసి సుమారు 240 మంది ఉంటారన్నారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. గాంధీ వంటి ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.9500 వరకు వేతనాలు చెల్లిస్తుంటే. నిలోఫర్‌లో మాత్రం రూ.7500 వరకు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఉద్యోగుల ధర్నాతో ఆసుపత్రిలో ఎక్కడి చెత్త అక్కడే కనిపించింది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణరెడ్డి

ప్రైవేట్ ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

- బట్టీ చదువులు వద్దు ● డీఈఓ సత్యనారాయణరెడ్డి

కర్మాన్‌ఘాట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులనే ప్రైవేట్ పాఠశాలలో నియమించుకోవాలని రంగారెడ్డి జిల్లా డీఈఓ కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు, కరస్పాండెంట్స్, ప్రిన్సిపాళ్ల సమావేశాన్ని హస్తినాపురం డివిజన్ కర్నూల్ రోడ్డు మందమల్లమ్మ చౌరస్తాలోని చంద్రాగార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ సత్యనారాయణరెడ్డి, ఎస్సీఈఆర్‌టీ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలకు వస్తున్న ప్రతి విద్యార్థి ఆధార్‌ను రిజిస్టార్‌లో నమోదు చేయాలని సూచించారు. సైన్స్‌పై అవగాహన ప్రాజెక్టులను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. మూల్యాంకణంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలని పేర్కొన్నారు. ప్రవేట్ విద్యార్థులకు పుస్తకాల మోత తగ్గించాలన్నారు. సెప్టెంబర్ నెలలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు దశల వారిగా శిక్షణ ఇస్తామని ఆయా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విడతల వారిగా రావాలని సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రాముఖ్యత తదితర అంశాల గురించి తెలియజేశారు. విద్యాశాఖ విధానాలకు లోబడి ప్రవేట్ పాఠశాలలను నడుపుతామని ప్రభుత్వం నుంచి తమకు పూర్తి సహకారం అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి. నారాయణరెడ్డి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు భరత్, మీనేందర్‌రావు, శేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనం భద్రంగా ఉండాలి.. అదే సమయంలో పక్కవారికి ముప్పుగా మారకూడదనే స్పృహ లోపిస్తోందనడానికి ఈ చిత్రంలోని దృశ్యం నిదర్శనం. అమీర్‌పేట వద్ద ద్విచక్ర వాహనంపై ఇనుప కడ్డీలను తీసుకెళుతున్న యువకుల తీరు వారితో పాటు ఇతరులకూ ప్రమాదకరమే..

వీఎం హోం ఖాళీ స్థలాలను విద్యా సంస్థలకే ఇవ్వాలి

- తెలంగాణ విద్యార్థి వేదిక డిమాండ్



నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

సరూర్‌నగర్: సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోం ఖాళీస్థలాలను విద్యా సంస్థల అభివృద్ధికే కేటాయించాలని తెలంగాణ విద్యార్థి వేదిక ప్రతినిధులు కోరారు. పోలీస్ కమిషనరేట్‌కు పది ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై బుధవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. జీఓ 48ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఉత్తరాలను రాయించారు. విద్యార్థి వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.గోపి మాట్లాడుతూ.. కమిషనరేట్‌కు ఇక్కడి స్థలాన్ని సీఎం కేటాయించడం సబబు కాదన్నారు. దానికి మరోచోట చూసుకోవాలని.. వీఎం హోం స్థలాలను మాత్రం తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉన్నత చదువులు, వసతి గృహాల కల్పనకు ఉపయోగించాలన్నారు. టీవీవీ ప్రతినిధులు నవీన్, వెంకటేశ్, దేవేందర్, నజీర్, విద్యార్థులు పాల్గొన్నారు.



లేఖనుచూపిస్తున్న విద్యార్థి

చేతి సంచి మనమేంటో చెబుతుంది



- పట్టుకునే విధానంతో వ్యక్తిత్వం అంచనా
- రోజువారీ పనుల శైలిని బట్టి మనస్తత్వం విశ్లేషణ

ఈనాడు, హైదరాబాద్

మీరు తరచూ చేతి సంచీ (బ్యాగ్) ధరిస్తారా..? అది లేనిదే బయటకు రావడానికి ఇష్టపడరా..? అయితే.. మీరు ఎలాంటి వారో ఇట్టే చెప్పేయచ్చు.. ఇది వినగానే.. అంతా తూచ్ అంటూ కొట్టి పారేయకండి.. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం.. సంచిని భుజాన వేసుకునే తీరును బట్టి మీ వ్యక్తిత్వాన్ని అంచనా వేయచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కో వ్యక్తిత్వం ఉంటుంది.. కాకపోతే కొందరు తొందరగా బయటపడతారు.. మరికొందరిని అర్థం చేసుకునేందుకు కొద్దిగా సమయం పడుతుంది. మనలో చాలా మందికి ఓ విషయం తెలియదు.. రోజువారీ చేసే సాధారణ పనులే మన వ్యక్తిత్వం గురించి చాలా విషయాలను తెలియజేస్తాయి. ధరించే వస్త్రాల నుంచి.. నడిచే తీరు వరకు ప్రతి అంశం మనమేంటో చెప్పేస్తాయి. మన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తాయి.

వెనుక వైపు..

సంచిని వెనుక వైపు ధరించే వారికి ఆకర్షణ శక్తి ఎక్కువగా ఉంటుంది.. అందరూ వారిని తొందరగా ఇష్టపడతారు. ఇతరుల గురించి శ్రద్ధ తీసుకుంటారు. ఎప్పటికీ ఒకేలా ఉండేందుకు ఆసక్తి చూపించరు. నిత్యం కొంగొత్తగా చేయాలని తపిస్తుంటారు. రిస్క్ తీసుకునేందుకు ఎప్పుడు ముందుంటారు. సాహోసపేతమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఎప్పుడైనా.. ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉంటారు.



చేతిలో పట్టుకుంటే..

మనలో చాలా మందికి ఓ అలవాటు ఉంటుంది.. అదేంటంటే.. సంచిని చేతిలో పట్టుకుంటుంటారు. ఇలాంటి వాళ్లకు అన్ని విషయాల్లో స్పష్టత ఉంటుంది.. వాళ్లేం చేస్తున్నారో వాళ్లకు తెలుసు.. హడావుడిగా అడుగేయరు.. అన్నీ ఆలోచించాకే ముందుకెళ్తారు. వాళ్లపై వాళ్లకు నియంత్రణ ఉంటుంది. దాపరికాలు అంటూ ఉండవు. కుటుంబ సభ్యులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. వాళ్లతో ప్రతిదీ పంచుకుంటారు. వీళ్లకున్న విశ్వాసమే.. వీళ్లను పదుగురిలో ప్రత్యేకంగా నిలుపుతుంది. ముక్కుసూటిగా.. నిజాయతీగా అభిప్రాయాన్ని చెబుతారు.



భుజానికి వేసుకొని చేతితో పట్టుకుని..

కొందరికి భుజానికి సంచిని వేసుకొని చేతితో పట్టుకోవడం అలవాటుగా ఉంటుంది. ఇలాంటి వాళ్లు పుస్తకాల పురుగులు.. చదివేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. కొత్త పుస్తకాల కోసం వల వేసి మరీ వెతుకుతారు. వేరే వాళ్ల గురించి పెద్దగా పట్టించుకోరు.. వాళ్ల పనేదో వాళ్లు చూసుకుంటారు.

జబ్బకు ధరించి..!

భుజానికి ధరించే వారు తమను తాము చూపించుకోవాలని అనుకుంటున్నారు. ఇతరులు పొగడాలని ఆశ పడుతుంటారు. ఆకట్టుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇతరులు తమని చూస్తున్నారా లేదా అంటూ గమనిస్తారు. కాకపోతే.. కొంత ఉదార స్వభావాన్ని కలిగి ఉంటారు.

ముందు వైపు..!

ఇటీవల ఈ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపేటప్పుడు సంచిని ముందుకు వేసుకుంటారు. ఇలాంటి వాళ్లు ఆత్రపరులు.. ప్రతి విషయాన్ని తెగ ఆలోచిస్తుంటారు. ఎంతకు తేల్చరు. హడావుడిగా నిర్ణయం తీసుకుంటారు.. తర్వాత బాధపడతారు. వీరి విషయంలో ఇతరులు తొందరగా ఓ నిర్ణయానికి వచ్చేస్తారు.

మరి.. ఇంకెందుకు ఆలస్యం.. మీ వ్యక్తిత్వమేంటో మీరు తెలుసుకోండి.. ఆశ్చర్యపోక మానరు.. పైన చెప్పిన అన్ని లక్షణాలైతే ఉండకపోవచ్చు.. కానీ కొన్ని మాత్రం పక్కాగా ఉంటాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.















పురావస్తు.. మస్తు..

మూడో సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసఫ్ అలీఖాన్ 128వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మ్యూజియంలో ఇటీవల నూతనంగా పిల్లల గ్యాలరీ ఏర్పాటు చేశారు. దీనిని బోర్డు సభ్యుడు నవాబ్ ఎతెరామ్ అలీఖాన్ ప్రారంభించారు. ఇప్పటికే ఉన్న అయిదువేల కళాఖండాలకు తోడుగా మరో రెండువేల ఆకృతులు ఇందులో కొలువు తీరాయి. విభిన్న రూపాల్లోని పురాతన గడియారాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ జంతువులు, పక్షుల బొమ్మలతోపాటు కూరగాయలు, ఫలాలు, అంగళ్లలో వ్యాపారుల బొమ్మలు, శాతవాహనులు, కుషాణులు, మొగలులు, కుతుబ్‌షాహీ, విజయనగర రాజుల కాలం నాటి పురాతన నాణేలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడి గ్యాలరీల సంఖ్య నలభైకి చేరింది.

– న్యూస్‌టుడే, చార్మినార్







పాఠాలు... బతకడం నేర్వాలి





- ఆత్మహత్యలు చేసుకునే వారిలో విద్యాధికులే ఎక్కువ
- కొలువుల్లో కష్టమొచ్చినా అదే బాట
- చిన్న సమస్యనూ ఎదుర్కోలేక పోతున్నారు
- ఆత్మస్థైర్యం కొరవడుతోందంటున్న నిపుణులు

- హైదరాబాద్‌కు చెందిన సాయి శరత్(21).. బెంగళూరులోని ఐఐటీ కళాశాలలో ఎంటెక్ చదువుతున్నాడు. ఈనెల 11వ తేదీ తెల్లవారు జామున వసతిగృహంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ఎంటెక్ పూర్తి చేసిన ఎర్రిస్వామి సుల్తాన్‌బజార్ పరిధిలో ఉంటూ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కారణం ఏమైనాగానీ ఆగస్టు 15న ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థి చందానగర్ సమీపంలో బహుళ అంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- శామీర్‌పేటకి చెందిన రాధిక ఆగస్టు 17న ఆత్మహత్యకు పాల్పడింది.
- వనస్థలిపురంలో ఉంటున్న బీటెక్ పూర్తి చేసిన లక్ష్మణ్ (25) ఆగస్టు 14న రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఈనాడు, హైదరాబాద్

ఉన్నత విద్య పూర్తి చేసి.. చేతిలో డిగ్రీ, పీజీ పట్టాలుండి.. మంచి ఉద్యోగం దక్కించుకున్న వారు సైతం ఒత్తిడి తట్టుకోలేక.. ఆత్మహత్యకు పాల్పడే వారు ఎందరో ఉంటున్నారు. అక్షరం ముక్క కూడా చదువుకోని చాలామంది దేశంలో వ్యాపారాలు, రాజకీయాల్లో రాణిస్తుంటే.. ఉన్నత విద్యావంతులు కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం ప్రస్తుతం సమాజంలో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మంచి కొలువు దక్కి చక్కటి జీతం వస్తున్నా.. నిండు జీవితాన్ని తృణప్రాయంగా వదులుకుంటున్నారు. చిన్నపాటి సమస్య వచ్చినా చాలామందిలో ఎదుర్కొనే ఆత్మస్థైర్యం ఉండడం లేదు. హైదరాబాద్‌లో కొన్నేళ్లుగా మృతి చెందిన వారి గణాంకాలు తీసుకుంటే.. అందులో ఎక్కువ మంది డిగ్రీ, పీజీలు చేసినవారే ఉంటున్నారు. కొందరైతే ఉద్యోగాలు చేస్తూ మంచి జీతం పొందుతున్నవారు ఉన్నారు. అలాగే పదో తరగతి, ఇంటర్‌లలో మంచి మార్కులు రాకపోయినా పలువురు తనువు చాలిస్తున్నారు. బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసి మంచి ఉద్యోగం చేస్తూ మంచి జీతం పొందుతున్న వారు కొందరు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చదివిన చదువులు వీరి జీవితాలను కాపాడలేక పోతున్నాయని, విద్యాసంస్థలే చిన్నతనం నుంచి విద్యార్థులో ఆత్మ స్థైర్యం నింపాలని పలువురు విద్యారంగ నిపుణులు వివరిస్తున్నారు. ఎంతటి కష్టం వచ్చినా ధైర్యంగా పరిష్కార మార్గాలను అన్వేషించే నైపుణ్యం వారికి నేర్పించాలని కోరుతున్నారు. వీటికి పాఠ్యాంశాల్లో స్థానం కల్పించాలని సూచిస్తున్నారు. చదివిన చదువు కొలువు చూపించే విధంగా ఉంటే కొంత సమస్య తీరుతుందని వారు పేర్కొన్నారు.

పోలికలే అత్యంత ప్రమాదం..

ఎదుటివారికి ఖరీదైన కారు ఉంది.. విశాలమైన ఇల్లు ఉందని.. విలాసవంతమైన వస్తువులు ఉన్నాయని చాలామంది పోల్చుకుంటూ ఉంటారు. నిత్య జీవనంలో వినియోగించే వస్తువుల నుంచి చేపట్టే ఉద్యోగం, జీతం తదితరాలు అన్నింటినీ చాలామంది ఎదుటి వారితో పోల్చుకుంటున్నారు. తమ కంటే చిన్న వయస్సు వారికి ఎక్కువ జీతం వస్తుందని, ఉన్నత హోదాలో ఉన్నారని మరికొందరు మనస్తాపానికి గురవుతున్నారు. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు తదితరాలు కొందరి విషయాల్లో కారణంగా నిలుస్తున్నాయి. ఏ సమస్యనైనా ఎలా పరిష్కరించుకోవాలో మార్గాలను అన్వేషించకుండానే ఆత్మహత్యకు పాల్పడుతున్నవారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. ఒకరితో పోలికలు చూసుకోవడం చాలా ప్రమాదమని మానసిక నిపుణులు వివరిస్తున్నారు. ఎవరి ఆర్థిక పరిస్థితికి తగినట్లు వారుజీవనం సాగించడం అలవాటు చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

ఒత్తిడిని ఎదుర్కొనేలా ఓదార్పు

-డాక్టర్ అనిత, మానసిక నిపుణురాలు



ఏదైనా సాధించే పట్టుదల, నేర్పు యువతలో ఉంటుంది. అయితే, వారికి వచ్చిన కష్టాన్ని అర్థం చేసుకొనే వారు కొరవడితే తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. దీనిని కుటుంబసభ్యులు, స్నేహితులు ఎవరైనా గుర్తించి వారికి ఆత్మస్థైర్యాన్ని అందించాలి. ఆత్మహత్యకు పాల్పడే ముందు చాలామంది కొన్ని తీవ్రమైన పదాలను వినియోగించడం, బ్లేడుతో కోసుకోవడం వంటివి చేస్తుంటారు. పరోక్షంగా వారి అభిప్రాయాలను ఇతరులతో చెబుతారు. వాటిని కుటుంబసభ్యులు లేదా స్నేహితులు గుర్తించి మానసిక నిపుణుల వద్దకు తీసుకొస్తే మేలు. కాని ఇంట్లో పెద్దలే చాలామంది కౌన్సెలింగ్ చేస్తుంటారు. అవి తక్కువ ఫలితాలనే ఇస్తున్నాయి. వారి సమస్యను పసిగట్టి అందుకు పరిష్కారమార్గాన్ని సూచించే నైపుణ్యం మానసిక నిపుణులకు ఉంటుందని గుర్తించాలి.

దిశా నిర్దేశంతో పరిష్కారం..

-గంపా నాగేశ్వరరావు, వ్యక్తిత్వ వికాస నిపుణులు



ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో ఎక్కువ మంది ఉద్యోగులు, విద్యావంతులు ఉంటున్నారు. వీరికి వచ్చిన కష్టాన్ని పరిష్కరించుకొనే నైపుణ్యం వారిలో కొరవడుతోంది. చదివిన డిగ్రీలు వీరికి సహాయ పడట్లేదు. డిగ్రీ, పీజీ పాఠ్యాంశాలతోపాటే విద్యాసంస్థల్లో వ్యక్తిత్వవికాస నిపుణులతో సదస్సులు తప్పకుండా ఏర్పాటు చేయించాలి. యువతకు ఎలాంటి సమస్యలు ప్రస్తుతం ఎదురవుతున్నాయి.. వాటిని ఎలా పరిష్కరించుకోవచ్చో దిశానిర్దేశం అందులో దొరుకుతుంది. చిన్నప్పటి నుంచి ప్రేమాభిమానాలు చూపించే తల్లిదండ్రులు.. పెద్దవయస్సు వచ్చేసిందని దూరంపెడతారు. అది మంచిదికాదు. వారిలో గుండె ధైర్యాన్ని నింపాలి.



నిపుణుల సూచనలు ఇవీ..

- డిగ్రీ, పీజీ చేస్తున్న లేదా ఉద్యోగం చేస్తున్న వారికి కుటుంబ సభ్యులు సన్నిహితంగా ఉండాలి. ప్రేమాభిమానాలు చూపించాలి.
- యువత అభిప్రాయాలను వారు పట్టించుకోకపోతే ఆత్మన్యూనతకు లోనవుతారు.
- తల్లిదండ్రుల అభిప్రాయాలను పిల్లలపై రుద్దకూడదు. వారికి ఇష్టమైన రంగాన్ని ఎంచుకోనివ్వాలి. వాటిల్లో కష్టసుఖాలను విడమర్చి చెప్పాలి.
- 18 నుంచి 40 ఏళ్ల వారిపై ఎక్కువగా వివిధరకాల ఒత్తిళ్లు ఉంటాయి. జీవితంలో స్థిరపడాలని, మంచి ఉద్యోగం సాధించాలని, కోరుకున్న తన అభిరుచికి తగిన భాగస్వామి దొరకాలని ఇలా చాలా కోరికలు వీరిపై ఉంటాయి. వీటిని సాధించడంలో చిన్న కష్టమొచ్చినా పలువురు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు.
- యువత అవసరాలను గుర్తించి ఆర్థిక ఇబ్బందులు ఉంటే కుటుంబ సభ్యులే తీర్చాలి. లేకపోతే మార్గాలను చూపాలి.
- ఉద్యోగం చేసే చోట కొందరు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. దానిని వదులుకుంటానంటే కుటుంబ సభ్యులు వద్దంటారు. ఇంట్లోవారికి నచ్చజెప్పలేక కార్యాలయాల్లో యజమాని ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయలేక తీవ్ర అంతర్మథనానికి కొందరు గురవుతుంటారు. వీటిని గురించి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలి.
- స్నేహం, ప్రేమ విషయంలోను కొన్ని ఇబ్బందులు ఎదురు కావచ్చు. ఇలాంటి సందర్భాలను పంచుకునే సన్నిహితులు ఉండాలి.
- పది, ఇంటర్ చదివే వారితో కుటుంబ సభ్యులు సన్నిహితంగా ఉంటారు. డిగ్రీ, పీజీ తదితర స్థాయికి చేరిన వారి విషయంలో మాత్రం దూరంగా ఉంటున్నారు. వీరు తమ కష్టాలను ఎవరికీ చెప్పుకోలేక పోతుంటారు.

పరుగులున్న చోటుకి పరుగెత్తుకొస్తారు

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతారు
- ఎర్త్‌లింగ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుల స్ఫూర్తి



ఈనాడు, హైదరాబాద్

పరుగులున్న చోటుకు పరుగెత్తుకొస్తారు.. కానీ పరుగెత్తరు. మరి ఎందుకొచ్చినట్లు.. ఆదివారం నగరంలో మారథాన్ జరిగింది. కొన్ని వేలమంది పరుగెత్తుతున్నారు. వారి చూపంతా గమ్యాన్ని ముద్దాడటం పైనే. కొందరు మాత్రం రోడ్డుపై తాగి పడేసిన నీళ్ల సీసాలు, చెత్త కాగితాలను సంచుల్లోకి ఎత్తే పనిలో నిమగ్నమయ్యారు. నగరంలో ఎక్కడ పరుగులు జరిగినా ఎర్త్‌లింగ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వాలిపోతారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తారు.

నగరంలో ఫిట్‌నెస్, ఆరోగ్యం, సామాజికాంశాలపై అవగాహన కల్పించేందుకు నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్క్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో ఆదివారం అవగాహన పరుగులు, నడక కార్యక్రమాలను వేర్వేరు సంస్థలు నిర్వహిస్తుంటాయి. పరుగు ముగిశాక అలసిపోయిన వారికి నిర్వాహకులు నీటి సీసాలు, స్నాక్స్ అందజేస్తుంటారు. తాగాక, తిన్నాక చాలామంది ఎక్కడంటే అక్కడ పడేసేవారు. మంచి సందేశం కోసం పరుగులో పాల్గొన్నవారు. అక్కడంతా చెత్త చేయడంపై నిర్వాహకులు విమర్శల పాలయ్యేవారు. ఈపరిస్థితిలో క్రమంగా మార్పు వచ్చింది.

బృందంగా ఏర్పడి.. కొందరు సభ్యులు బృందంగా ఏర్పడి ఎక్కడ పరుగులు జరిగినా అక్కడ వాలిపోయి.. ఆ పరిసరాల్లో చెత్త పడేయకుండా వీరు సేకరిస్తున్నారు. ఆదివారం జరిగిన మారథాన్ నెక్లెస్‌రోడ్‌లో మొదలై గచ్చిబౌలిలో ముగిసింది. 42 కి.మీ..20వేల మంది పాలుపంచుకున్నారు. ఎంత చెత్త పోగయ్యేదో ఊహించుకోండి. నిజంగానే మారథాన్ జరిగిందా అని సందేహించేలా రహదారులు శుభ్రంగా ఉండటం వెనక ఎర్త్‌లింగ్స్ సభ్యుల కృషి ఉంది. పరుగు ప్రారంభానికి ముందు ఎలాగుందో తర్వాత అంతే శుభ్రంగా రహదారిని ఉండేలా చూస్తుంటారు. వీరు అక్కడున్నారంటే ఎవరైనా సరే వారు చేత్తో పట్టుకున్న సంచిలోనే ఖాళీ సీసాలు, కవర్లు పడేస్తుంటారు. పరుగు ఏదైనా వీరు భాగస్వాములుగా ఉండి స్వచ్ఛ స్ఫూర్తి నింపుతున్నారు.



పరుగు తీసే మార్గంలో స్వచ్ఛత కోసం యత్నం

శుభ్రంగా ఉండేలా చూస్తాం..

- శ్రీరామ్, ఎర్త్‌లింగ్స్



అంతక్రితం వేరే సంస్థలో ఉండేవాళ్లం. కొన్ని కారణాలతో అందులోంచి వచ్చేసి 2016 నవంబరులో ఎర్త్‌లింగ్స్ పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాం. చెన్నైలో గౌతమ్‌రెడ్డి చూస్తారు. హైదరాబాద్ ఛాప్టర్ నేను చూస్తున్నాను. మా సంస్థలో ప్రస్తుతం 35 మంది వలంటీర్లు ఉన్నారు. మారథాన్లు, 10కె పరుగులు నిర్వహించే వారితో కలిసి పని చేస్తుంటాం. కార్యక్రమం పూర్తయ్యాక కూడా పరిశుభ్రంగా ఉండేలా చూస్తుంటాం. క్లీన్ అప్ డ్రైవ్స్ నిర్వహిస్తుంటాం. మాకున్న సభ్యులు తక్కువే అయినా పెద్ద కార్యక్రమాలు జరిగినప్పుడు విద్యార్థులు, స్నేహితులు పాల్గొంటుంటారు. మొన్నటి మారథాన్‌లో 375 మంది పాలు పంచుకున్నారు. తెల్లవారుజామునే 4.30 కల్లా పరుగు నిర్వహించే ప్రదేశానికి చేరుకుని క్లీన్‌ఆప్ డ్రైవ్ నిర్వహించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోతే ఇది సాధ్యం కాదు.



చుక్‌చుక్ రైలు.. కుచ్‌కుచ్ అందం

ఆహ్లాదకరంగా పచ్చదనం వెల్లివిరుస్తున్న పంట చేలు పక్క నుంచి వెళుతున్న రైలు.. ఘట్‌కేసర్ సమీపంలో కనిపించింది ఆకట్టుకునే దృశ్యం

'వేగ' మంత్రం ప్రమాదం.. సురక్షిత చోదనం మోదం



- 89,321 మంది విద్యార్థులకు ట్రాఫిక్ పోలీస్ అవగాహన
- డ్రైవింగ్ లైసెన్స్ తప్పక తీసుకుంటామంటూ సంసిద్ధత



ప్రమాదాలపై సన్నివేశాలను చూపిస్తూ వివరిస్తున్న సిబ్బంది

ఈనాడు, హైదరాబాద్

రాజధాని రహదారులపై ప్రమాదాలను నియంత్రించేందుకు... బైక్ రేసులు... డ్రంకెన్ డ్రైవ్.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కూడదంటూ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా అమలు చేస్తున్న 'సురక్షిత చోదక అలవాట్లు' కార్యక్రమం లక్ష్యం దిశగా సాగుతోంది.. నగరంలో డిగ్రీ ఆపై చదువుకుంటున్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన సదస్సుల్లో ఆసక్తిగా పాల్గొంటున్నారు. నెల రోజుల వ్యవధిలో లక్షమంది విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించగా.. 20 రోజుల వ్యవధిలో 89,321 మంది విద్యార్థులను కలుసుకున్నారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా నడపడం, ద్విచక్ర వాహన చోదకులు గల్లీల్లో దూసుకెళ్లడం.. దుకాణాల ముందు కార్లు నిలిపి కొనుగోళ్లు చేయడం, రద్దీ వేళల్లో ఫుట్‌పాత్, రహదారులపై వాహనాలను నిలిపేసి వెళ్లడం, కూడళ్ల వద్ద ఎడమ వైపు వెళ్లే వాహనాలకు దారివ్వాలని తెలిసినా అక్కడే వాహనాలను నిలపడం వంటివి చేస్తున్నారు. వీటన్నింటినీ మార్పించి యువచోదకులకు 'సురక్షిత చోదక అలవాట్ల'ను నేర్పించేందుకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు అన్నింటిలోనూ ట్రాఫిక్ విభాగం రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు.

సెలబ్రిటీల ప్రసంగాలు.. లఘు చిత్రాలు..

విద్యార్థులను కలుసుకుంటున్న పోలీసులు ముందుగా వారికి లఘు చిత్రాలను చూపిస్తున్నారు. ఐదు నిముషాల వ్యవధిలోనే అన్ని అంశాలను చెప్పాలన్న ఉద్దేశంతో వీటిని రూపొందించారు. ఆద్యంతం వారిని ఆకట్టుకోవాలన్న లక్ష్యంతో అన్ని అంశాలుండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కథా నాయకుడు అల్లు అర్జున్, దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ప్రసంగాలతో పాటు గతంలో ప్రమాదాల పరిణామాలపై మాట్లాడిన రాజేంద్రప్రసాద్, బాబూమోహన్, రకుల్‌ప్రీత్‌సింగ్ దృశ్యాలను అందులో ఉంచారు. వీటన్నింటితో పాటు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా రూపొందించిన ట్రాఫిక్ దృశ్య శ్రవణ రూపకం, బ్రాండింగ్‌లోని స్లైడ్లను కలిపి ఒక సీడీగా తయారు చేశారు. పోలీస్ ఉన్నతాధికారుల సందేశాలు కూడా ఇందులో ఉన్నాయి. సురక్షిత చోదక అలవాట్లు, రహదారులపై ఉల్లంఘనల కారణంగా జీవితంలో వచ్చే మార్పులు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా ఎంతమంది చనిపోతున్నారన్న వివరాలను, కొన్ని కీలకమైన అంశాలను దృశ్య శ్రవణంలోనూ ఎక్కువ సేపు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థులతో ప్రమాదాలపై మాట్లాడిస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకుంటాం...

ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెళ్తున్నప్పుడు లఘుచిత్రాల ప్రదర్శన అనంతరం డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నాయా? అంటూ విద్యార్థులను ప్రశ్నిస్తున్నారు. వాహన చోదక అనుమతి పత్రాలు లేకుండా బైకులు, స్కూటీలు నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, నాలుగైదు సార్లు ఇలాగే పోలీసులకు దొరికిపోతే జైలుకు వెళ్లే అవకాశాలుంటాయని వారికి వివరిస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు చెప్పిన అంశాలను విన్న కొందరు విద్యార్థులు తమకు డ్రైవింగ్ లైసెన్స్ లేదని, త్వరలో తీసుకుంటామని చెబుతున్నారు. ఇకపై వేగంగా బైక్‌లను వాహనాలను నడపబోమని పోలీసులకు వివరిస్తున్నారు. పాయింట్ల విధానం అమల్లోకి వచ్చాక శిరస్త్రాణం తప్పకుండా ధరిస్తున్నామని పేర్కొంటున్నారు.

మరికొందరు విద్యార్థులు తమకు పద్దెనిమిదేళ్లు నిండక పోయినా వాహనాలు నడుపుతున్నామని, డ్రైవింగ్ లైసెన్స్‌కు పద్దెనిమిదేళ్లు నిండాలన్న నిబంధన ఉందని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. చట్టప్రకారం ఇది తప్పని, పద్దెనిమిదేళ్ల లోపు వాహనాలు నడపకూడదంటూ పోలీస్ అధికారులు వివరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునేందుకు రవాణా శాఖ సులువైన విధానాలను అమలు చేస్తోందని చెబుతున్నారు.

ప్రమాదాలు తగ్గుతున్నాయ్ : డాక్టర్ వి.రవీందర్, సంయుక్త కమిషనర్(ట్రాఫిక్)



చోటు చేసుకుంటున్న ప్రమాదాల దృశ్యాలను విద్యార్థులకు దృశ్య, శ్రవణ రూపంలో చూపిస్తున్నాం. అతివేగం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తున్నాం. మేం నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో పాల్గొంటున్న కొందరు విద్యార్థులు సానుకూలంగా స్పందిస్తున్నారు. సురక్షిత చోదక అలవాట్లపై వారు కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. సదస్సుల ప్రభావం ఉందా.. లేదా.. అని తెలుసుకునేందుకు వారం పాటు కొన్ని విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ప్రమాదాల నమోదు, ట్రాఫిక్‌జాంలను పరిశీలించాం. ఆయా ప్రాంతాల్లో కొన్నిచోట్ల ప్రమాదాలు తగ్గాయి.

28 నుంచి నైపుణ్యాల పెంపుపై ఉచిత శిక్షణ

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ కెరీర్ సర్వీస్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 28వ తేది నుంచి సెప్టెంబరు 1 వరకు ఐదు రోజుల పాటు ఉచిత ప్లేస్‌మెంట్ కార్యశాల, ముఖాముఖి, సాఫ్ట్ నైపుణ్యాలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ చీఫ్ ఎ.లింగ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఈ ఉచిత కార్యశాలకు హాజరయ్యేందుకు పేర్లను నమోదు చేసుకోవాలని, 040-27098153 ఫోన్‌నంబరు ద్వారా వివరాలు తెలియచేయాలని కోరారు.

మేడ్చల్‌లో ఏసీబీ అధికారుల తనిఖీ

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఆదిలాబాద్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఆడెపు బాబు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఆడెపు బాబు భార్య విజయలక్ష్మి ఎస్టీఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి చేరుకున్న అధికారులు సాయంత్రం వరకు రికార్డులను పరిశీలించారు.

ఎక్కడి నుంచి వచ్చిందో.. బతుకు చాలించింది!



లక్ష్మి(పాతచిత్రం)

అల్వాల్, న్యూస్‌టుడే: ఓ అభాగ్యురాలు ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. అడ్డకూలీగా పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ హఠాత్తుగా మృతిచెందడంతో ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. రెండు నెలల క్రితం లక్ష్మి (30)గా పరిచయం చేసుకొన్న ఆ మహిళ మచ్చబొల్లారం కుమ్మరి బస్తీలో అద్దె ఇల్లు తీసుకొని తన ఇద్దరు పిల్లలు రాణి, లోకేశ్‌లను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి, 1వ తరగతిలో చేర్పించింది. అప్పటి నుంచి కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని నడుపుతోంది. ఈక్రమంలో బుధవారం వేకువజామున నిద్రలోనే ఆమె మృతిచెందింది. తల్లికి ఏమైందో తెలియక ఆమె శవం పక్కన కూర్చుని పిల్లలు ఏడ్వడంతో ఘటన స్థానికుల ద్వారా వెలుగులోకి వచ్చింది. పోలీసులు శవానికి పంచనామా చేసి గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి పూర్తి వివరాలు తెలియకపోవడంతో పిల్లలను అనాథాశ్రమానికి పంపించారు. ఇంట్లో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా భర్త బండారి జంగయ్యగా, నిజామాబాద్ నివాసిగా గుర్తించారు. ఈమేరకు పోలీసు బృందాన్ని నిజామాబాద్ పంపించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తి రిమాండ్

మేడిపల్లి(బోడుప్పల్), న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిని మేడిపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పీర్జాదిగూడ బుద్ధానగర్‌లో నివాసం ఉండే సతీష్(32) ప్రైవేట్ ఉద్యోగి. 2017 మార్చిలో కరీంనగర్ జిల్లాకు చెందిన కవిత(28)తో వివాహం జరిగింది. పెళ్లైన నాటి నుంచే అదనపు కట్నం కావాలంటూ వేధింపులకు పాల్పడుతుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి కవిత పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం సతీష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

వ్యభిచారం కేసులో ఐదుగురు అరెస్టు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆర్కేనగర్‌లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న నిర్వాహకురాలితోపాటు ఇద్దరు విటులు, ఇద్దరు యువతులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్కే నగర్‌లోని ఒక అపార్టుమెంట్‌లో కె.వసుంధర (45) గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఈ విషయం పోలీసుల దృష్టికి రావటంతో మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు బాధితురాళ్లు, విటులు.. ఎస్.భిక్షపతి (42), ఆర్.వెంకటరాం (39) పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు యువతులను హోంకు తరలించారు.

నమూనా ఉద్యానంగా 'బొటానికల్' అభివృద్ధి

- రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి
- 9న మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న సైకిల్‌ట్రాక్



కరపత్రాన్ని విడుదల చేస్తున్న బండా నరేందర్‌రెడ్డి తదితరులు

మాదాపూర్ న్యూస్‌టుడే: కొత్తగూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి బొటానికల్ గార్డెన్‌ను నగరంలో మోడల్ ఉద్యానంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.5 కోట్లు వెచ్చించి ఉద్యానవనాన్ని సర్వాంగసుందరంగా తయారుచేసేందుకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో దాదాపు 274ఎకరాలు విస్తరించి ఉన్న అటవీప్రాంతంలో పచ్చదనం పెంపొందిస్తూ ప్రజలకు ఆహ్లాదం అందించేలాఅన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నక్షత్రవనం, నవగ్రహ వనం, రాశీవనం, పంచవటి వనం, రోజ్‌గార్డెన్, మూలికావనం, సీతాకోకచిలుకల వనం, ఎడారి మొక్కల వనాలను ఏర్పాటు చేస్తునామన్నారు. పాలపిట్ట పార్కులో 3కిలోమీటర్ల సైకిల్‌ట్రాక్ నిర్మాణం పూర్తయిందని, వచ్చేనెల 9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ట్రాక్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్‌తో కలిసి ఇక్కడ సైక్లింగ్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాల చిన్నారులకు వన్యప్రాణులు, మొక్కలపై అవగాహన కల్పించేందుకు ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దృశ్యశ్రవణ కేంద్రం, ఎత్నిక్ కాటేజ్, అటవీ ఉత్పాదనల విక్రయ కేంద్రం, బోటింగ్ సదుపాయం, పిల్లల పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చందన్‌మిత్ర మాట్లాడుతూ గార్డెన్‌లో సందర్శకులను ఆకట్టుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు ప్రత్యేకంగా రెస్టారెంట్, కాఫీ షాప్, మూత్రశాలలు, యోగా కేంద్రం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. అక్టోబరుకల్లా ఆయా పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. సమావేశంలో బొటానికల్ గార్డెన్ అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఓఎస్‌డీలు నాగభూషణం, తిమ్మారెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఔటర్‌ను పట్టించుకోని ప్రజారవాణా

- అవకాశం ఉన్నా ఆలోచించని అధికారగణం
- ఎంఎంటీఎస్.. ఆర్టీసీ విస్తరణ శూన్యం

ఈనాడు హైదరాబాద్


నగరాభివృద్ధిలో వ్యూహం ఉండాలి. 50 ఏళ్ల ముందు చూపుండాలి. కనీసం 20 ఏళ్ల అవసరాలను గుర్తించాలి. అప్పుడే పక్కా ప్రణాళికతో సాగుతుంది. నివాస ప్రాంతాలు వెలిసిన తర్వాత.. రహదారులు వేయడం, మురుగు కాలువలు నిర్మించడం, తాగునీటి లైన్లు వేయడం వంటి కార్యక్రమాలతో గందరగోళం చేసి.. నివాసితులను ఇబ్బంది పెట్టడంకంటే ముందుగానే ప్రణాళికాబద్ధ కార్యాచరణను చేపడితే బాగుంటుంది. కానీ ఆ విషయమే పట్టించుకోవడంలేదు. అలా అని హెచ్‌ఎండీఏ దగ్గర ప్రణాళికలు లేవా అంటే అదీ లేదు. మాస్టర్ ప్లాన్ ఉన్నా అమలయ్యే అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నగర విస్తరణ పరుగులు పెడుతోంది. ఎల్‌బీనగర్, లంగర్‌హౌస్‌ను కలుపుతూ ఒకప్పుడు ఉండే రింగు రోడ్డు ఇప్పుడు ఇన్నర్ రింగు రోడ్డుగా మారిపోతోంది. ఇప్పుడు 158 కి.మీ. మేర ఔటర్ రింగు రోడ్డును అందుబాటులోకి తెచ్చారు. దీంతో నగర స్వరూపమే మారిపోయింది. విలాసవంతమైన కట్టడాలు ఔటర్ చుట్టూ వస్తున్నాయి. అమెరికాలో మాదిరి రెండు మూడు ఎకరాల్లో ఇల్లు కట్టుకొని ప్రశాంతమైన జీవితం సాగిద్దామనుకునేవారు ఎక్కువవుతున్నారు. నగర జీవి కాస్త ఉపశమనం పొందాలంటే ఔటర్‌కు ఆనుకుని ఉన్న రిసార్టులకు పరుగులు పెడుతున్నారు. ఇలా అభివృద్ధిలో నగరం దూసుకుపోతుంటే దీనికి అనుగుణంగా ప్రజారవాణా అందుబాటులోకి రావడంలేదు.

ఔటర్ చుట్టూ రైల్వే లైను..

హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఔటర్ రింగు రోడ్డు చుట్టూ సర్క్యూట్ లైను వేసి లోకల్ రైళ్లు నడవాలని ఉంది. చుట్టూ సర్క్యూట్ మాదిరి రైళ్లు పరుగులు పెడుతుంటే.. ప్రయాణికులను నగరానికి చేర్చే బాధ్యత ఆర్టీసీపై ఉంది. మెట్రో వస్తున్న వేళ బస్సులను నడపడానికి ఆర్టీసీ కూడా సిద్ధంగా ఉంది. కానీ రైల్వే లైను రావాలంటే అది ఎంతో ప్రయాశ. ఔటర్ రింగు రోడ్డు పనులతోనే ఇది కూడా జరిగిపోతే ఇప్పటికే రైళ్లు పరుగులు పెట్టేవి. అలా జరగకపోవడంతో ఇప్పుడా సర్వీసు రోడ్డులో బస్సులు నడపాలని. . రైళ్లు నడపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా తాగునీటి పైపులైను నిర్మించడానికి జలమండలి సన్నాహాలు చేస్తోంది. ఇలా ఔటర్ రింగురోడ్డు చుట్టూ వెలిసిన కొత్త కాలనీలకు, ఇప్పటికే ఉన్న గ్రామాలకు తాగునీరు అందించాలనేది ప్రణాళిక. కానీ ప్రజారవాణాలోనే అది లోపించింది.

రైల్వే సహాయమంత్రి భాజపా వినతి..

ఇటీవల రైల్వే సహాయమంత్రి రాజన్ గొహైన్ నగరానికి వచ్చారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా నగర, రాష్ట్ర నేతలు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఔటర్ రింగు రోడ్డు చుట్టూ రైల్వే లైను వేసి రైళ్లను నడపాలని కోరారు. ఇందుకు తగిన సహకారం అందించి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శనం చేయాలని కోరారు. అప్పుడే ఔటర్ రింగు రోడ్డు చుట్టూ ఉన్న గ్రామాలతోపాటు అక్కడ కొత్తగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్న ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు అవసరమైన ఖర్చును రైల్వే సగం భరించాలని సూచించారు. ఔటర్ చుట్టూ దాదాపు 180 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. అలాగే అనేక అపార్టుమెంట్లు, కొత్త టౌన్‌షిప్‌లు అందుబాటులోకి వస్తున్నవేళ ముంబయి మాదిరి రైల్వే ప్రయాణాలు నగరంలో పెరుగుతాయన్నారు. వినతిపత్రం అందుకున్న మంత్రి ఈ విషయాన్ని మంత్రిత్వశాఖలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రాజన్ గొహైన్‌కి వినతిపత్రం ఇస్తున్న భాజపా నేతలు (పాత చిత్రం)



రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో నిలోఫర్ ఆసుపత్రిలోని పొరుగు సేవల సిబ్బంది ధర్నాలో పాల్గొన్నారు. దీంతో బుధవారం ఎక్కడి వ్యర్థాలు అక్కడే ఉన్నాయి. ఆసుపత్రిలో అంతటా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

– న్యూస్‌టుడే, రెడ్‌హిల్స్



పర్యావరణ పరిరక్షణలో భాగంగా బుధవారం హ్యుండాయ్ సంస్థ మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ప్రతిమలతో కంపెనీ ప్రతినిధులు

అక్రమ కట్టడాల కూల్చివేత



కూల్చివేత ప్రక్రియను పర్యవేక్షిస్తున్న అధికారులు

గోషామహల్: అంతర్ రాష్ట్ర రహదారిగా పేరొందిన గోషామహల్ ప్రధాన రోడ్డుపైనున్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ కన్నెర్ర చేసింది. గోషామహల్ ప్రధాన రోడ్డుపై ప్లైవుడ్ గోడౌన్లు, దుకాణాలను అక్రమంగా నిర్వహిస్తూ కోట్ల రూపాయలు గడిస్తోన్న అక్రమ వ్యాపారుల గుండెల్లో దడ పుట్టించారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తు నడుమ ఉదయం పదిన్నర గంటలకు మొదలైన అక్రమ దుకాణాలు, కట్టడాల కూల్చివేత పనులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఉప కమిషనరు సేవా ఇస్లావత్, జీహెచ్‌ఎంసీ ఏస్టేట్ అధికారి సూర్యకుమార్‌ల నేతృత్వంలో నాల్గు జేసీబీలతో పాటు సుమారు యాభై మంది సిబ్బంది, అధికారులు ఈ కూల్చివేత పనుల్లో పాల్గొన్నారు. గోషామహల్ పోలీసు స్టేడియం ప్రధాన రోడ్డు నుంచి మొదలుకొని హిందీనగర్ బస్ స్టాపు వరకు గల పదహారు ప్లైవుడ్ దుకాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల యాజమానులు, సిబ్బంది నుంచి తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదురైంది. అబిడ్స్ ఏసీపీ రాఘవేంద్రరెడ్డి నేతృత్వంలో బేగంబజార్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు శ్రీనయ్య, సుధాకర్, నెహ్రూ, అశోక్‌రెడ్డిలతో పాటు ప్రత్యేక పోలీసు బృందాల పర్యవేక్షణలో అక్రమ కట్టడాల కూల్చివేత సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలన్నీ చేపట్టారు. దశాబ్దాల తరబడిగా కొనసాగుతున్న ఈ అక్రమ నిర్మాణాల వల్ల రోడ్డు వెడల్పుకు అవరోధం ఏర్పడూ వచ్చిందని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. కోర్టు తీర్పు మేరకు ఈ కూల్చివేత పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. కాగా స్థానికంగా కొందరు బడా వ్యాపారులకు కొమ్ముకాస్తూ జీహెచ్‌ఎంసీలోని కొందరు అధికారులు తమను రోడ్డుపాలు చేశారని బాధితులు ఆరోపించడం గమనార్హం. అంతర్ రాష్ట్ర రహదారిగా పేరొందిన గోషామహల్ ప్రధాన రోడ్డును వంద అడుగులకు విస్తరించాలన్న ప్రణాళికలో భాగంగానే రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు కోర్టు అనుమతి తీసుకొని చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.



నియంత్రిక.. నిర్లక్ష్యానికి ప్రతీక

సోమాజిగూడలోని బాబూఖాన్ మిలీనియం కేంద్రం సమీపంలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ భారీగా తీగ మొక్కలు అల్లుకుపోయాయి. దీంతో అది ఏ క్షణాన పేలుతుందో అని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

దుర్గాప్రసాద్‌కు డీఐగా స్థానచలనం

ఈనాడు, హైదరాబాద్: సైబరాబాద్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లను కేటాయిస్తూ కమిషనర్ సందీప్‌శాండిల్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌లో అటాచ్డ్‌గా ఉన్న పలువురికి ఈ సందర్భంగా స్థానచలనం కలిగింది. భూవివాదంలో తలదూర్చిన ఘటనలో ఇటీవలే రాయదుర్గం ఠాణా ఎస్‌హెచ్‌వో బాధ్యతల నుంచి తప్పించిన దుర్గాప్రసాద్‌కు తాజా పోస్టింగ్‌ల్లో భాగంగా పేట్‌బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాలుగునెలలు కాకముందే అటాచ్ అయిన శ్రీనివాసచారిని కంట్రోల్ రూంలో నియమించారు. పురుషోత్తం అటాచ్డ్ సీపీవో ఎస్‌వోటీ మాదాపూర్‌కు, రామకృష్ణ అటాచ్డ్ పీసీఆర్ ఐటీవిభాగం, ఆనంద్‌రెడ్డి అటాచ్డ్ సీపీవో కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం,

సత్తయ్య అటాచ్డ్ సీపీవో కూకట్‌పల్లి ట్రాఫిక్, శ్రీనివాసచారి అటాచ్డ్ సీపీవో కంట్రోల్‌రూం, దుర్గాప్రసాద్ అటాచ్డ్ సీపీవో డీఐ పేట్‌బషీరాబాద్, రాంబాబు అటాచ్డ్ పీసీఆర్ సీసీఎస్ మాదాపూర్,

డి.వి.రంగారెడ్డి సీసీఎస్ మాదాపూర్ ఆర్‌జీఐఏ ట్రాఫిక్, షఫియుద్దీన్ సీసీఆర్‌బీ డీఐ శంషాబాద్, జి.సత్యనారాయణ మైలార్‌దేవ్‌పల్లి పీసీఆర్, రాంచందర్‌రావును ఐటీసెల్ ట్రాఫిక్ అడ్మిన్‌లో పోస్టింగ్ ఇచ్చారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రోశయ్య తదితరులు

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి

వివేక్‌నగర్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిస్వార్థ ఆదర్శ ప్రజానాయకుడు, దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అని తమిళనాడు మాజీ గవర్నర్ డా.కె.రోశయ్య కొనియాడారు. ప్రకాశం స్వయంకృషితో సమున్నతిని సాధించిన విశిష్ట వ్యక్తిత్వం కలిగిన మహనీయుడని కీర్తించారు. ప్రకాశం అభివృద్ధి, అధ్యయన సంస్థ-ట్రస్టు, త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాసుబ్బారావు సమావేశ ప్రాంగణంలో నిర్వహించిన ప్రకాశం 146వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యయన సంస్థ ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్ ఆంగ్లంలో రచించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం-ఏ ప్రొఫైల్ ఇన్ కరేజ్ పుస్తకాన్ని, రచయిత రావినూతల శ్రీరాములు రాసిన గుంటూరు నరసభూపతి నరిపెల్లి నర్సింహారావు జీవిత సంగ్రహం పుస్తకాన్ని డా.రోశయ్య ఆవిష్కరించి గ్రంథకర్తలను సత్కరించారు. మొదట మంజీర కూచిపూడి అకాడమీ నిర్వాహకులు రేణుకాప్రభాకర్ శిష్యులు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. గాయకులు ఎన్.మురళీధర్, సాయిప్రకాష్, ఆంజనేయులు దేశభక్తి గీతాలు పాడారు. కార్యక్రమానికి గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించగా ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవీఆర్ కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, అధ్యయన సంస్థ ఉపాధ్యక్షుడు కేవీఎల్ఎన్ఎస్‌శర్మ పాల్గొన్నారు.



గజాననా.. ఇటు కనుమా!

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే

ఎలుకల్లో నలుపు, గోధుమ, తెలుపు రంగు రకాలు ఉన్నాయి. వీటితో పాటు పందికొక్కులు, చంచు ఎలుకలు ఉంటాయి. ఇవే ఎక్కువగా మన ప్రాంతంలో కనిపిస్తుంటాయి. వీటికి పునరుత్పత్తి సామర్థ్యం అధికంగా ఉంటుంది. నలుపు రంగు ఎలుక 12 నెలలు, గోధుమ రంగు ఎలుక రెండు నుంచి నాలుగేళ్లు జీవిస్తుంది. మగ ఎలుకతో కలిసిన 21 రోజుల్లోనే పిల్లలను కంటుంది. మళ్లీ 21 రోజుల్లోన్లే గర్భం దాలుస్తుంది. ఒక్కో కాన్పులో ఎనిమిది నుంచి పది పిల్లలు వరకు కంటుంది. ఏడాదికి ఐదు నుంచి ఆరు సార్లు ఈనుతుంది. దీనివల్లే ఎలుకల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మానవులు, ఎలుకల వయసును ఒకసారి సరిపోల్చితే.. ఆరు వారాల ఎలుక 18 ఏళ్ల మనిషితో, 12 వారాల ఎలుక 30 ఏళ్లు, 18 వారాల ఎలుక 45 ఏళ్లు, 27 వారాల ఎలుక 60 ఏళ్లు, 30 వారాల ఎలుక 70 ఏళ్ల మనుషులతో సమానం.



మీకు తెలుసా..

● ఎలుకల్లో శాకాహార, మాంసాహార ఎలుకలు ఉంటాయి. ఎలుకలపై అధ్యయనం, బోధనకు ప్రత్యేకంగా ఇంగ్లండ్‌లో 'హౌస్ ఆఫ్ యానోవర్ విశ్వవిద్యాలయం' ఉంది.

● అరటికాయ, ఉల్లిపాయలు, ఎండిన చేపలను ఎలుకలు ఇష్టంగా తింటాయి.

● వరి, మినుప, పెసలు, కందులు, వేరుశనగ, జొన్న, రాగులు, సజ్జలు వంటి ఆహారోత్పత్తులను ఎలుకలు తింటాయి. నీళ్లు బాగా ఉంటే పొలానికి సరిహద్దులుగా నలువైపులా ఉండే గట్టులకు కన్నాలు వేసుకుని వాటిల్లో ఉంటాయి. కన్నాల్లోనే ఆహారోత్పత్తులను నిల్వ చేసుకుంటాయి. తీపిగా ఉండే చెరుకు గడలు, వరి, జొన్న కంకులను సైతం కొరుక్కుని తింటాయి. చివరకు మనిషి అరికాళ్లపై ఉండే పొట్టును సైతం పీక్కుతింటాయి.

రూ.కోట్లలోనే నష్టం విలువ

ఎలుక వల్ల పంట నష్టంతో పాటు ఇళ్లలో, దుకాణాల్లో, గోదాముల్లో నిల్వ చేసిన ఆహారపదార్థాలు పాడవుతుంటాయి. వాసన, వినికిడి ద్వారానే ఎక్కువగా ఆహారాన్ని వెతుక్కుంటాయి. మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఎలుకల వల్ల ఎకరాకు ఐదారు బస్తాల ధాన్యం దిగుబడులను రైతు కోల్పోవాల్సి వస్తోంది. వ్యవసాయశాఖ యంత్రాంగం సైతం వ్యవసాయ సదస్సుల్లో ఎలుకలు నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించడం లేదు.

నివారణ చాలా సులభం

ఎలుకల నివారణకు అధిక మొత్తంలో వ్యయం చేయాల్సిన అవసరం లేదు. పావుకేజీ నువ్వుల నూనెలో నూకలు కలిపి రాత్రంతా నానబెట్టాలి. ఎలుక కన్నాల వద్ద 100 మిల్లీ గ్రాములు అంటే చెంచాలో సగం ఆ నూకలు చల్లితే చాలు.. వాటి వాసనకు బయటకు వచ్చేస్తాయి. ఆ నూకలు తింటే వెంటనే ఎలుక చనిపోతుంది.

నివారణకు ఇవి చేయాలి..

● పొలాల వద్ద ఎలుకల నివారణకు మగాణి భూముల్లో గట్ల సంఖ్య తగ్గించాలి.

● పొలాల గట్లపై కలుపు లేకుండా శుభ్రంగా పారతో చెక్కుకోవాలి.

● వరి పైర్లలో నారుమడి దశ నుంచి పంట కోతకు వచ్చే వరకు బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి.

● పంటలు లేని సమయంలో పొలాల్లో, రైతులందరూ కలిసి సామూహిక ఎర పద్ధతి పాటించాలి.

● వరిపైర్లు ఏ దశలో ఉన్నా.. బ్రోఫ్యూమిగేటర్(పొగబారించే యంత్రం)తో పొగను ఎలుకల బొరియల్లోకి వదలాలి.

● ఎలుకలు ఎక్కువగా ఉండే పొలాలు, గోదాములు, ఇతర ప్రాంతాల్లో బ్రోమదయోలోన్ మందును నూకలు, నూనెలో కలిపి ఉండలు చేసి కన్నాల్లో వేయాలి. నూకలు 96 శాతం, నూనె రెండు శాతం, మందు రెండు శాతం కలిపి ఉండలు చేసి పొట్లాలు కట్టి కన్నాల్లో పెట్టాలి. ఎలుకల సమస్య తీవ్రంగా ఉంటే జింకు ఫాస్ఫేట్ మందును నూనెలో కలిసి ఉండలు చుట్టి కన్నాల్లో ఉంచాలి.

వ్యాధుల బాధలు..

ఎలుక కొరకడం వల్ల గాట్లు, గాయాలు ఏర్పడతాయి. వాటి మూత్రం, మలం వల్ల ఆహారపదార్థాలు కలుషితం అవుతాయి. గీతం వ్యాధి వల్ల జ్వరం వస్తుంది. మూత్రం, మలం వల్ల ఆహారపదార్థాలు కలుషితమై కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. మెదడు పొరల వాపు, హృదయ సమస్యలు ఏర్పడతాయి. దీంతో పాటు భయంకరమైన ప్లేగు వ్యాధి వచ్చే ఆవకాశం ఉంది. సాల్మోనిల్లా వ్యాధి కలుషిత ఆహారం వల్ల వస్తుంది. ఇది బ్యాక్టీరియాతో వ్యాపిస్తుంది. లెప్టోస్పైరోసిస్, ర్యాబిట్ ఫీవర్, హంటా వైరస్ సిండ్రోమ్ వ్యాధులను మొదట్లోనే గుర్తించి చికిత్స అందిచాలి. లేకపోతే ప్రాణాంతకంగా మారతాయి. శ్వాససమస్యలు సైతం వస్తాయి. ఎలుకలు, పందికొక్కులు ఎక్కువగా ఆహారపదార్థాలు నిల్వ ఉండే ప్రాంతాల్లోనే స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి. ముఖ్యంగా తిని ఆహారం పారేసే ప్రాంతాల్లో ఎక్కువగా కన్పిస్తాయి.



ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి మంత్రి ఈటలకు వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

బీసీలకు ఉపయుక్తంగానే ప్రభుత్వ నిర్ణయాలు

మంత్రి ఈటల రాజేందర్

సనత్‌నగర్, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతులకు పూర్తిగా ఉపయోగపడే విధంగానే ప్రభుత్వ నిర్ణయాలుంటాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సంచార జాతిగా ఉన్న తమ సామాజిక వర్గాన్ని ఎంబీసీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో రాష్ట్ర భట్రాజు సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భట్రాజు కులాన్ని ఎంబీసీ జాబితాలో చేర్చేందుకు బీసీ కమిషన్‌కు విన్నవించాలన్నారు. తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. భట్రాజుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్‌రాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొల్లేపల్లి సీతారామరాజు, రాష్ట్ర సంఘం ప్రతినిధులు కరుణాకర్ రాజు, రామరాజు, మురళీధర్‌రాజు, సురేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



తార్నాకాలోని హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో సిబ్బందికి బుధవారం కమిషనర్ చిరంజీవులు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. పర్యావరణహితంగా వినాయక చవితిని చేసుకోవాలని కోరారు – ఈనాడు, హైదరాబాద్

'శానిటరీ న్యాప్‌కిన్‌లపై జీఎస్టీ... మహిళలను కించపరచడమే'

లక్డీకాపుల్: శానిటరీ న్యాప్‌కిన్‌లపై వస్తు సేవా పన్ను (జి.ఎస్.టి.) విధించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మహిళలను కించపరిచిందని శాసనమండలి పూర్వసభ్యుడు డాక్టర్ కె.నాగేశ్వర్ విమర్శించారు. సైఫాబాద్ జీవితబీమా సంస్థ భవనంలో 'జీఎస్టీ - మహిళలపై ప్రభావం' అంశంపై వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదస్సులో నాగేశ్వర్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. అత్యధిక శాతం బాలికలు, మహిళల ఆరోగ్యానికి అవసరమైన న్యాప్‌కిన్‌లను విలాస వస్తువుల జాబితాలో చేర్చి 18 శాతం పన్ను విధించడం సమంజసం కాదన్నారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి బి.హైమావతి మాట్లాడుతూ... జి.ఎస్.టి. పేరిట ప్రజల రక్తమాంసాలు పీలుస్తున్నారని విమర్శించారు. ప్రతిరోజూ ఖరీదైన నాలుగు డ్రెస్సులు మారుస్తున్న ప్రధాని మహిళల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేటింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ మాట్లాడుతూ రానున్నకాలంలో పరిశ్రమలలో ఆహారం, రవాణాపై జి.ఎస్.టి. పెంచే అవకాశం ఉన్నదని, దాని ప్రత్యక్ష ప్రభావం మహిళలపై ఉంటుందని పేర్కొన్నారు. చిన్న పరిశ్రమలు మూతపడటం వల్ల 50-60 శాతం మహిళలు ఉద్యోగాలు కోల్పోతారని చెప్పారు. ఈ సదస్సులో ఏఐఐఈఏ, సీఐటీయూ, ఐద్వా, బీఎస్ఎన్ఎల్ఈయూ, సీసీజీఈడబ్ల్యూ, సీఎస్‌యూటీఎఫ్, టీఎంఎస్ఆర్‌యూ, ఆర్‌బీఐఈఏ, ఏఐఎస్ఈఎఫ్, హెచ్ఆర్‌జీఐఈఏల ప్రతినిధులు పాల్గొని జి.ఎస్.టి.తో మహిళలకు కలిగే ఇబ్బందిని గురించి ప్రసంగించారు.

'గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి'

హయత్‌నగర్, న్యూస్‌టుడే: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా శాంతియుతంగా జరుపుకోవాలని రాచకొండ సంయుక్త సీపీ తరుణ్ జోషి అన్నారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో పోలీసులు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సీపీ మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, బక్రీద్ పండగను పురస్కరించుకొని హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలిగి పండగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా అసాంఘిక శక్తులు మతకల్లోలాలు సృష్టించే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విగ్రహాల నిమజ్జన సమయంలో రూట్ మ్యాప్ ప్రకారం పోలీసుల సలహాలు, సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్.బి.నగర్ డీసీపీ వెంకటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు సామతిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయ, ఆయా పార్టీల నాయకులు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తరుణ్‌జోషి

గణపతి రథాలు సిద్ధం!

వినాయకులు కొలువుదీరకముందే నిమజ్జన యాత్రకు రథాలు సిద్ధమవుతున్నాయి. కళాకారులు తమదైన సృజన, వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ వీటి తయారీలో నిమగ్నమయ్యారు. బాగ్‌లింగంపల్లి, సైఫాబాద్ ప్రాంతాల్లో కనిపించిన చిత్రాలివి.







కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు మహాసభ ప్రతినిధులు

మున్నూరు కాపులు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

కాచిగూడ, న్యూస్‌టుడే: మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపు సంఘాల సభ్యత్వ రుసుం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బుధవారం కాచిగూడలోని మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాశెట్టి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుతారి నర్సింహులు, కోశాధికారి బండి శ్రీనివాస్, కార్యదర్శులు చామకూర ప్రదీప్, మాణిక్ ప్రభు, ఆది నగేశ్, మణికొండ వెంకటేశ్వర్‌రావు, వినోద్‌కుమార్, ఆనంద్, ప్యాట శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. శతాబ్ద చరిత్ర కలిగిన మున్నూరు కాపు మహాసభ రాష్ట్రంలోని మున్నూరు కాపుల సమస్యలపై పోరాటాలు చేస్తుందన్నారు. లక్ష మందితో త్వరలోనే మున్నూరు కాపుల సింహ గర్జన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.